జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP   సంపుటి : 1   సంచిక: 149   శనివారం 25 అక్టోబరు– 2025 పేజీలు : 8   వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## కర్నూలు బస్సు ప్రమాదం..

# మృతదేహాలకు ప్రమాదస్థలి వద్దే డీఏన్ఏ, పోస్టుమారం టెస్టులు



### కర్నూలు సమీపంలో ప్రైవేట్ బస్సులో ఘోర అగ్నిప్రమాదం

- ప్రమాదంలో సుమారు 20 మంది ప్రయాణికులు సజీవ దహనం
- గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహాలు, ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం
- డీఎన్ఏ పరీక్షల రిపోర్టుల ఆధారంగా మృతదేహాల అప్పగింత
- నలుగురు క్షతగాత్రులకు ఆసుపత్రిలో చికిత్స



కర్నూలు, అక్టోబరు 24 (సందేశం టైమ్స్) : కర్నూలు సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో జరిగిన ఘోర అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ దుర్ఘటనలో సుమారు 20 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతుండగా, మృతదేహాలను వెలికితీశారు. అయితే, మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో వాటిని గుర్తించడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో, ఘటనా స్థలంలోనే వైద్య బృందాలు పోస్టుమార్టంతో పాటు డీఎన్ఏ పరీక్షల కోసం నమూనాలను సేకరిస్తున్నాయి. డీఎన్ఏ రిపోర్టులు వచ్చిన తర్వాత, వాటి ఆధారంగా మృతులను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

2లో

## అదే తేలితే చర్యలు తప్పవు..

## ప్రైవేట్ ట్రావెల్స్‌కు సీఎం వార్నింగ్



అమరావతి, అక్టోబర్ 24(సందేశం టైమ్స్) : కర్నూలు బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇతర రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, అధికారులతో సమగ్ర విచారణకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. మృతుల వివరాలు గుర్తించి కుటుంబాలకు తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా వైద్యశాఖకు సూచనలు చేశారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఫిట్‌నెస్, సేఫ్టీ , పర్మిట్ తనిఖీలకు ముఖ్యమంత్రి ఆదేశిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు.

## కేదార్‌నాథ్, యమునోత్రి ఆలయాల మూసివేత



రుద్రప్రయాగ్/ఉత్తరకాశీ,అక్టోబరు 24(సందేశం టైమ్స్) : శీతాకాలం రావడంతో హిమాలయాల్లోని పవిత్ర పుణ్యక్షేత్రాలైన కేదార్‌నాథ్, యమునోత్రి ఆలయాలను ఉత్తరాఖండ్ అధికారులు మూసివేశారు. ఈ సందర్భంగా గురువారం ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రుద్రప్రయాగ్ నుంచి కేదార్‌నాథుడి పల్లకి ఊరేగింపు ఆర్మీ మేళతాళాలు, సుమారు పది వేల మంది భక్తుల నినాదాల మధ్య ఘనంగా ప్రారంభమయింది. ఈ ఊరేగింపు శనివారం నాటికి ఉఖిమఠ్‌లోని ఓంకారేశ్వర ఆలయానికి చేరుకోనుంది. మిగిలిన ఆరునెలల పాటు ఆ ఆలయంలో కేదార్‌నాథుడు పూజలందుకుంటాడు. ఈ ఉత్సవాల్లో ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ ఏడాది చార్‌ధామ్ యాత్ర చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్ ఆలయాలను అధికారులు మూసివేయగా, బద్రీనాథ్ ఆలయాన్ని నవంబరు 25న మూసివేయనున్నారు. మంచు, తీవ్రమైన చలి కారణంగా ప్రతి సంవత్సరం అక్టోబరు–నవంబరు నెలల్లో ఈ ఆలయాలను మూసివేసి ఏప్రిల్– మే నెలల్లో తిరిగి తెరుస్తారు.

## ఏపీకి గూగుల్ రాక వెనుక

# 13 నెలల శ్రమ ఉంది: మంత్రి లోకేశ్

### పెట్టుబడిదారులకు మూడు ప్రధాన కారణాలు వివరించిన మంత్రి



ప్రాజెక్టులు మీవి కావు.. మనవి అంటూ పెట్టుబడిదారులకు భరోసా గత 16 నెలల్లో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వెల్లడి

ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామన్న లోకేశ్ నవంబర్‌లో విశాఖలో పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్.. హాజరు కావాలని ఆహ్వానం

అమరావతి, అక్టోబరు 24 (సందేశం టైమ్స్) : ఆంధ్రప్రదేశ్‌కు గూగుల్ డేటా సెంటర్ రావడం వెనుక 13 నెలల నిరంతర కృషి దాగి ఉందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా ఇండియా బిజినెస్ కౌన్సిల్ (ఏఐబీసీ), సీఐఐ సంయుక్తంగా నిర్వహించిన పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడిదారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఏపీని పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎందుకు ఎంచుకోవాలో వివరించారు.

పెట్టుబడులకు మూడు ప్రధాన కారణాలు

ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి

2లో

## అధికారులను ఇబ్బంది పెడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి: పవన్



అమరావతి, అక్టోబరు 24 (సందేశం టైమ్స్) : విజయవాడలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి అటవీ శాఖ అధికారుల వర్క్ షాప్‌లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. డ్యూటీ చేసే అధికారులను ఎవరైనా ఇబ్బంది పెడితే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అధికారులను ఇబ్బంది పెడితే అది కూటమి పార్టీల నాయకులు అయినా సరే చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. అధికారుల విధులకు ఆటంకం కలిగించవద్దని ఆయన స్పష్టం చేశారు.

# మళ్లీ.. రాష్ట్ర పర్యటనకు విజయ్

చెన్నై,అక్టోబరు 24 (సందేశం టైమ్స్) : 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధ్యక్షుడు విజయ్ మళ్ళీ రాష్ట్ర పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. వచ్చే వారం పర్యటన ప్రారంభించాలని విజయ్ భావిస్తున్నారు. ఈ విషయంపై ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్‌తో పాటు పార్టీ సీనియర్ నేతలతో ఆయన సమాలోచన చేస్తున్నట్టు టీవీకే వర్గాలు పేర్కొంటున్నాయి. గత నెల 27వ తేదీన విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార సభలో తొక్కిసలాట జరిగి 41 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆయన రాష్ట్ర పర్యటన నిలిపివేశారు. ఈ నేపథ్యంలో తాను నిలిపివేసిన పర్యటన మళ్ళీ ప్రారంభించేందుకు విజయ్ సిద్ధమవుతున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ ఒకటి రెండు రోజుల్లో వెల్లడికావచ్చని భావిస్తున్నారు. ఈ పర్యటన సమయంలో ప్రజల భద్రతపై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ నేతలకు విజయ్ స్పష్టమైన ఆదేశాలిచ్చినట్టు సమాచారం. ముఖ్యంగా



రోడ్‌షోలకు దూరంగా ఉండాలని భావిస్తున్నారు.

## బాలయ్య పేరు ఎత్తే అర్హత నీకుందా?..

## జగన్‌పై నుడా చైర్మన్ ఫైర్



2లో

## పీ మంత్రి వర్గ ఉపసంఘం భేటీ..

## పలు కీలక అంశాలపై చర్చ

అమరావతి, అక్టోబరు 24 (సందేశం టైమ్స్) : భూ సంస్కరణల పై ఇవాళ(శుక్రవారం) ఏపీ సచివాలయంలో

మిగతా 2లో...

## బస్సు ప్రమాదంపై అన్ని కోణాల్లో విచారణ: అనిత



కర్నూలు, అక్టోబరు 24 (సందేశం టైమ్స్) : ఏపీలో విషాద ఘటన చోటు చేసుకుంది. కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై వెంటనే అప్రమత్తమైన ప్రభుత్వ యంత్రాంగం ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరం చేసింది. మృతి చెందిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందజేయాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా.. బస్సు ప్రమాద ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత వివరాలు వెల్లడించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్రమాదంలో 17 మంది పెద్ద వాళ్లు ఇద్దరు చిన్నపిల్లలు చనిపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

మొదటి పేజీ తరువాయి

# కర్నూలు బస్సు ప్రమాదం.. మృతదేహాలకు ప్రమాదస్థలి వద్దే డీఎన్ఏ, పోస్టుమారం టెస్టులు

సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు బంధువులు సంయమనం పాటించాలని ఆయన కోరారు. మరోవైపు, ఈ ప్రమాదంలో గాయపడిన వారి గురించి కూడా సూపరింటెండెంట్ వివరాలు తెలిపారు. మొత్తం 12 మందికి ఆసుపత్రిలో వైద్యం అందించగా, స్వల్ప గాయాలైన 8 మందికి ప్రథమ చికిత్స చేసి డిశ్చార్జి చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం నలుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. వీరిలో ఒకరికి తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయని, మిగిలిన ముగ్గురి పరిస్థితి మెరుగ్గానే ఉందని ఆయన వివరించారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యం అందిస్తున్నామని వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

# బాలయ్య పేరు ఎత్తే అర్హత నీకుందా?.. జగన్‌పై నుడా చైర్మన్ ఫైర్

నెల్లూరు, అక్టోబర్ 24: మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి (%చీబఖ జష్ట్రుఅతీఖఅ ఖశ్మీఎ =వఎఎ ాతీఅఅఙఖంబశ్రీబ =వఎఎ%) తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లుంది జగన్ తీరు ఉందంటూ వ్యాఖ్యలు చేశారు. తాగి అసెంబ్లీకి వచ్చారని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను విమర్శలు చేశాడు సైకో జగన్ అంటూ మండిపడ్డారు. దీన్ని బట్టి జగన్ మానసిక పరిస్థితి బాగోలేదని అర్థం అవుతోందన్నారు. బాలకృష్ణ అభిమానిని అని గతంలో చెప్పిన జగన్.. ఇప్పుడు రాజకీయాల్లో నిలబడలేక ఇటువంటి అబద్ధపు విమర్శలు చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. చంద్రబాబును ఎదుర్కోలేక, అభివృద్ధి పనులు చూసి ఓర్చుకోలేక.. బాలకృష్ణను తాగుబోతు అని విమర్శలు చేశారని మండిపడ్డారు.

# ఏపీకి గూగుల్ రాక వెనుక 13 నెలల శ్రమ ఉంది: మంత్రి లోకేశ్

మూడు ముఖ్య కారణాలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. "మొదటిది, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రూపంలో అనుభవజ్ఞుడైన, దార్శనిక నాయకత్వం ఉంది. భారీ ప్రాజెక్టులను ఎలా తీసుకురావాలో ఆయనకు బాగా తెలుసు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా మెండుగా ఉంది. రెండో కారణం, మేం ఒక స్టార్టప్ స్టేట్ మాదిరిగా దృఢ సంకల్పంతో పనిచేస్తాం. ఒకసారి మాతో చేతులు కలిపితే అది మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్. వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రాజెక్టు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తాం. నిర్దేశించిన సమయం కంటే ముందే పూర్తిచేయడమే మా లక్ష్యం. మూడోది, మాది జాతీయ దృక్పథం ఉన్న ప్రాంతీయ పార్టీ. దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తూనే, రాష్ట్రానికి మేలు చేకూర్చేలా జాతీయ విధానాలను ప్రభావితం చేస్తాం" అని వివరించారు.

గూగుల్, ఆర్సెలర్ మిట్టల్ ఉదాహరణలు

గూగుల్ ప్రాజెక్టు కోసం తాము పడిన శ్రమను లోకేశ్ గుర్తుచేశారు. "గూగుల్ డేటా హబ్ వెనుక 13 నెలల నిరంతర శ్రమ ఉంది. నేను స్వయంగా వారిని ప్రాజెక్టు స్థలానికి తీసుకెళ్లాను. వారి కార్యాలయానికి వెళ్లి ఏపీని ఎందుకు ఎంచుకోవాలో వివరించాను. వారు కోరిన విధానపరమైన మార్పుల కోసం ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్విని వైష్ణవ్‌లతో మాట్లాడి మార్పులు చేయించాం" అని తెలిపారు. కేవలం ఒక జూమ్ కాల్ ద్వారా దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ అయిన ఆర్సెలర్ మిట్టల్ ప్రాజెక్టును ఏపీకి తీసుకొచ్చామని, నవంబర్‌లో దీనికి శంకుస్థాపన చేయనున్నామని చెప్పారు.

# పీ మంత్రి వర్గ ఉపసంఘం భేటీ.. పలు కీలక అంశాలపై చర్చ



మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో ఈ భేటీ జరుగనుంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులు చర్చిస్తున్నారు. ప్రధానంగా భూ సంస్కరణల గురించి

# సింగితం గ్రామానికి నూతన గ్రంథాలయం మంజూరు

సందేశం టైమ్స్ :సంగారెడ్డి జిల్లాప్రతినిధి అక్టోబర్ 24 : రాయికోడ్ మండల పరిధిలోని సింగితం గ్రామ పంచాయతీకి నూతన గ్రంథాలయం మంజూరు అయింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, యువత ఉత్సాహం వ్యక్తం చేస్తూ నేతలకి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో గ్రంథాలయం స్థాపనకు కృషి చేసిన రాష్ట్ర మంత్రి వర్యులు దామోదర రాజ నర్సింహా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్యలకు గ్రామస్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రంథాలయం మంజూరుకు ప్రత్యేక చొరవ చూపిన రాయికోడ్ మండల మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ కృషిని ప్రజలు అభినందించారు. ఈ గ్రంథాలయం స్థాపనతో గ్రామ యువతకు విద్యా, విజ్ఞానాభివృద్ధికి కొత్త అవకాశాలు లభించనున్నాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

# జాబ్ మేళాకు విశేష స్పందన - మరో రోజు పొడిగింపు



సూర్యాపేట, అక్టోబర్ 24: హుజూర్నగర్‌లో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళాకు నిరుద్యోగుల నుండి భారీ స్పందన లభిస్తోంది. ఈ నేపథ్యంలో జాబ్ మేళాను మరో రోజు పొడిగించినట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హుజూర్నగర్‌లోని పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్‌నేషనల్ స్కూల్ ప్రాంగణంలో జాబ్ మేళా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు.

ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు పూర్తయ్యే లోపు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామనీ, గ్రామీణ ప్రాంత యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు.

జాతీయ స్థాయిలో పేరుపొందిన అనేక కంపెనీలు హుజూర్నగర్‌కు తరలివస్తున్నాయని, ఉమ్మడి నల్గొండ జిల్లాలోని సిమెంట్, ఫార్మా, మ్యానుఫ్యాక్చరింగ్ సంస్థలు కూడా పాల్గొంటున్నాయని తెలిపారు. ఇప్పటికే 36,000 మందికి పైగా నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఈ స్థాయిలో జాబ్ మేళా ఈ ప్రాంతంలో ఇదే తొలిసారి జరుగుతోందని చెప్పారు. నిరుద్యోగుల ఉత్సాహాన్ని దృష్టిలో ఉంచుకుని, రద్దీని నివారించేందుకు జాబ్ మేళాను రెండో రోజు కూడా కొనసాగించాలనే నిర్ణయం తీసుకున్నామని ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. జాబ్ మేళాకు రిజిస్ట్రేషన్ చేసుకున్న యువతీ యువకులు రెండవ రోజూ హాజరై అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని సూచించారు.

మేళాలో పాల్గొంటున్న 275 పరిశ్రమల వివరాలను కేటగిరీ వారీగా ఫ్లెక్సీల ద్వారా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగుల సౌకర్యార్థం అల్పాహారం, భోజనం వంటి సదుపాయాలు ఏర్పాటు చేయబడ్డాయని చెప్పారు. రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ సౌకర్యాలు, స్టాల్స్ వద్ద క్రమబద్ధత కోసం జిల్లా పోలీసు యంత్రాంగం మరియు వాలంటీర్లతో సమన్వయం చేసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజాస్ నందలాల్ పవార్, ఎస్పీ నరసింహ, డీ.ఇ.ఇ.టి. అసిస్టెంట్ డైరెక్టర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో జీవించటం నేర్పేందుకే ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు : ప్రిన్సిపల్



ఎడ్లగడ్డతండ, గుండ్లపల్లి మండలం, అక్టోబర్ 24: గుండ్లపల్లి మండలంలోని ఎడ్లగడ్డతండ గ్రామంలో దొంతినేని నరసింహారావు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన 7 రోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ టి. గోపాల్ రెడ్డి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు ఇలాంటి శిబిరాల ద్వారా సమాజంలో ఎలా జీవించాలో, ప్రజల సమస్యలను ఎలా అర్థం చేసుకోవాలో నేర్చుకుంటారని ఆయన అన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు కృష్ణయ్య, సంతోష్ కుమార్ మాట్లాడుతూ ు ఏడు రోజుల ప్రత్యేక శిబిరంలో విద్యార్థులు గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కార మార్గాలపై అవగాహన పొందారని తెలిపారు. గ్రామ ప్రజలు విద్యార్థుల సేవా తపనను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు డి. ఆంజనేయులు, శ్రీరాములు, హనుమంతు, లింగస్వామి, జ్యోతిశ్రీ, కోకిల, ప్రేమానందం, పూర్వ విద్యార్థి ఎం. తులసిరామ్, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జూదం ఆడుతున్న 11మందిపై కేసు నమోదు



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 24అక్టోబర్ సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం రాజుల గ్రామ పరిధిలో భారీ స్థాయిలో జూదం ఆడుతున్న 11మందిని పోలీసులు పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు అర్ధరాత్రి దాడి చేసిన పోలీసులు, జర్నప్ప వ్యవసాయ క్షేత్రంలోని చెరుకు తోటలో జూదం ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై సుజిత్ మాట్లాడుతూ, వివిధ గ్రామాలకు చెందిన 11మంది వ్యక్తులు జూదంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి రూ. 1,80,000 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. జూదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామ పరిధిలో ఇలాంటి అక్రమ కార్యకలాపాలు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గోరక్షక్ ప్రశాంత్ సింగ్‌పై కాల్పులు – నిందితులకు కఠిన శిక్ష విధించాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్





హైదరాబాద్, అక్టోబర్ 24 (సందేశం టైమ్స్):గోరక్షణ కార్యకర్త ప్రశాంత్ సింగ్ అలియాస్ సోనూ సింగ్ పై జరిగిన కాల్పుల ఘటనపై విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా స్పందించింది. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఖైరతాబాద్ చౌరస్తా వద్ద విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ముఖ్యమంత్రి, ఎంఐఎం పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేసి, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శించారు. గోవులను కాపాడటానికి వెళ్లిన ప్రశాంత్ సింగ్‌పై ఇబ్రహీం గ్యాంగ్ కాల్పులు జరపడం అమానుషమని, ప్రభుత్వ నిర్లక్ష్యమే ఇందుకు కారణమని అన్నారు. రాష్ట్రంలో గన్ కల్చర్ పెరుగుతోందని, ప్రభుత్వం అరికట్టకపోతే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. "ఒకవేళ భజరంగ్ దళ్ కార్యకర్తలు కర్రలతో రోడ్డు మీదకు వస్తే ఎలా ఉంటుందో ప్రభుత్వం ఊహించుకోవాలి,'' అని నాయకులు వ్యాఖ్యానించారు. ప్రాంత సహ కార్యదర్శి వెంకన్న జీ, తెలంగాణ రాష్ట్ర ధర్మప్రసార్ సుభాష్ జీ మాట్లాడుతూ, ప్రశాంత్ సింగ్‌పై అధికారులు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అక్రమ అరెస్టులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ప్రాంత సహ సంయోజక్ శ్రీకాంత్ జీ, మహేష్ యాదవ్ (హిందీనగర్ జిల్లా సహ కార్యదర్శి, విశాల్ భజరంగ్ దళ్, మహేష్ భజరంగ్ దళ్, సందీప్, సునీల్, అభిలాష్, గణేష్, దిలీప్ సింగ్, స్వరాజ్ జీ, అవదేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## సంస్కృతి శాపమా వరమా

సంస్కృతీ సంప్రదాయాల ప్రభావం నుంచి పూర్తిగా బయటపడటం మనకు అసాధ్యం. భూమ్మీద ఉన్నంతవరకూ గురుత్వాకర్షణను తప్పించుకోవటం ఎలా సాధ్యపడదో సంస్కృతి విషయంలోనూ మన పరిస్థితి అంతే! మనల్ని బంధించేది గురుత్వాకర్షణ శక్తి అని గుర్తించిన తర్వాతే దాన్ని అధిగమించే నియమాలను కనిపెట్టి అంతరిక్ష విన్యాసాలను చేయగలుగుతున్నాం. ఆకాశ ప్రయాణాలను సాగించగలుగుతున్నాం. అట్లాగే సంస్కృతిలో మంచిచెడులను గుర్తిస్తేనే మంచిని పెంచగలం. చెడుని తుంచగలం. ఒకనాటి పాశ్చాత్య ఆధిపత్యానికి సంస్కృతే కారణమని గట్టిగా వాదించే ఆర్థిక చరిత్రవేత్త జోల్ మోకియర్ ఈసారి నోబెల్ బహుమతికి ఎంపికయ్యారు. పాశ్చాత్య సంస్కృతి ఒక్కదానికే ఆ శక్తి ఎట్లా వచ్చింది? మిగతా వాటిల్లో అదెందుకు లేదు? మోకియర్ ప్రతిపాదనల లోతుల్లోకి వెళితేనే నిజం కొంత తెలుస్తుంది.ఐజాక్ న్యూటన్ గురుత్వాకర్షణ శక్తిని ప్రతిపాదించటం విజ్ఞానశాస్త్ర గతినే మార్చేసింది. ఇది అందరికీ తెలిసిందే. న్యూటన్ ముందూ తర్వాతా ఎందరో మహామహులు తమ ప్రయోగాలు, పరిశీలనలు ఆధారంగా విశ్వం స్వరూప, స్వభావాలను వర్ణించి మన ఆలోచనల్లో సమూల మార్పులు తెచ్చారు. అనుభవ జ్ఞానం ఆధారంగానే మన అభిప్రాయాలను ఏర్పరుచుకోవాలనీ నిర్దేశించారు. పెద్దలు చెప్పారనో, పవిత్ర గ్రంథాలు పేర్కొన్నాయనో భావిస్తూ పరిశీలనాశక్తిని కొండెక్కిస్తే మన చుట్టూ ఉన్న భౌతిక ప్రపంచాన్ని మన అవసరాలకు అనుగుణంగా సమర్థంగా ఉపయోగించుకోలేమనీ తేల్చిచెప్పారు. మనుషులు పారిశ్రామిక విప్లవంలోకి అడుగు పెట్టటానికి ప్రయోగ%–%పరిశీలన ఆధార ఆలోచనలే ప్రధాన కారణమయ్యాయి.మరి ఈ ఆలోచనలు యూరపులోనే పరిపక్వతను పొంది, అక్కడే పారిశ్రామిక విప్లవానికి ఎందుకు దారితీశాయి? వేల సంవత్సరాల నాగరికతలకు నిలయాలైన ఆసియా, ఆఫ్రికా ఖండాలు ఆ పరిణామానికి తొలుత ఎందుకు దూరంగా ఉండిపోయాయి? కారణం ఎక్కడ ఉంది? ఆ లోపానికి బాధ్యులెవరు? ఆసియా, ఆఫ్రికాలకు కాలం కలిసి రాలేదా? ప్రకృతిలోని అసమానతలే అందుకు దోహదం చేశాయా? సంప్రదాయాలూ, సంస్కృతులూ కొత్త ఆలోచనలకు ప్రతిబంధకాలయ్యాయా? ఇవన్నీ కీలక ప్రశ్నలు. అన్నీ పారిశ్రామిక విప్లవం చుట్టూ తిరిగేవే. పారిశ్రామిక విప్లవం కొన్ని దేశాలకు ఆధిపత్యాన్ని కట్టబెడితే, కొన్ని దేశాలకు పరాధీనతను ప్రసాదించింది. ధనిక%–%పేద దేశాలను సృష్టించింది. వలసరాజ్యాలు, సామ్రాజ్యాల ఏర్పాటుకు దారితీసింది. ఒక్కమాటలో చెప్పాలంటే పారిశ్రామిక విప్లవానికి సాటిరాగలిగిన విప్లవం మానవజాతి చరిత్రలోనే లేదు. అంతటి ప్రభావం చూపించిన పారిశ్రామిక విప్లవానికి దోహదం చేసిన కారణాలను మోకియర్ విశ్లేషిస్తే, దాని తదనంతరం ఏర్పడిన ఆర్థిక వ్యవస్థలో సృజనాత్మక విధ్వంసం ద్వారా వచ్చే సాంకేతిక మార్పులను ఆయనతో పాటు నోబెల్ బహుమతిని పంచుకున్న ఫిలిప్పే ఆగియన్, పీటర్ హౌయిట్‌లు పరిశోధించారు.మనం సంస్కృతి అనే పదాన్ని తరచూ చాలా పరిమిత అర్థంలో వాడతాం. సామాజికశాస్త్రాల్లో దానికి చాలా విస్తృతార్థం ఉంది. సంప్రదాయాలు, పూజలు, ఆరాధనా పద్ధతులు, కుటుంబ సంబంధాలు, మంచీచెడులు, ధర్మాధర్మాలు, నైతిక ప్రవర్తనలు, బాధ్యతలు లాంటివన్నీ సంస్కృతిలో భాగమే. కానీ వీటన్నిటికంటే మించింది వివేచనాశక్తి. హేతుబద్ధంగా ఆలోచించగలిగే తత్వం. కాలక్రమంలో సంస్కృతికి సంబంధించిన అనేక విషయాలు ముందుకాళ్లకు బంధనాలుగా మారతాయి. వాటిని తొలగించుకునే శక్తి కూడా సంస్కృతిలో భాగంగానే మనుషులకు లభించాలి. అలా లభించాలంటే వివేచనాశక్తి, హేతుబద్ధ ఆలోచనలకు సంస్కృతిలో ప్రాధాన్యత ఏర్పడాలి. ముఖ్యంగా సమాజంలో పై మెట్టులో ఉన్న వర్గాలు సంస్కృతిలో ఆ మేరకు సంస్కరణలకు మార్గాలు తెరవాలి. అట్లా యూరపులో కొత్త ఆలోచనలకు ద్వారాలు తెరవబట్టే పారిశ్రామిక విప్లవం సాధ్యమైందని జోల్‌మోకియర్ ప్రతిపాదించారు.వలసదేశాలను దోచుకోవటం, ఆఫ్రికా వాసులను బానిసలుగా అమెరికా ఖండానికి తీసుకువెళ్లటం, అక్కడి నుంచి బంగారం, వెండి లోహాలను కొల్లగొట్టటం, బలప్రయోగంతో ఆసియా%–%ఆఫ్రికా వ్యాపారస్థులను లొంగదీసుకోవటం, అతితక్కువ ధరలకు ముడిసరుకులను తరలించుకుపోవటం, రైతుల చేతుల్లో నుంచి భూములను తొలగించి వారిని కార్మికులుగా మారేలా చేయటం, బ్రిటన్‌కు భూమిపైపొరల్లో బొగ్గు తేలికగా లభించటం లాంటివన్నీ కలగలిసి పారిశ్రామిక విప్లవానికీ, ఆ తర్వాత యూరోపు ఆధిపత్యానికీ దోహదం చేశాయనీ చెప్పే వాదనలను తోసిపుచ్చుతూ జోల్‌మోకియర్ చేసిన ప్రతిపాదనలు ఆర్థిక చరిత్రకారుల్లో ఇప్పటికీ చర్చలను రగుల్చుతూనే ఉన్నాయి. ప్రయోగాలకూ, పరిశీలనలకూ ప్రాధాన్యమిచ్చే సంస్కృతి యూరపులో కొలంబస్ సాహసిక నౌకాయానాల కాలం నుంచి మొదలై ఐజాక్ న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించే నాటికి గట్టిగా స్థిరపడిందనీ, 18వ శతాబ్దంలో అదింకా బలపడి పారిశ్రామిక విప్లవానికి కావాల్సిన మేధో భూమికను తయారుచేసిందన్నదే మోకియర్ ప్రతిపాదనల్లో ప్రధానమైంది. ఆ సంస్కృతి వల్లే అనేక రంగాల్లో విజ్ఞానం పోగుపడి, యంత్రాల తయారీకి దారితీశాయని చెప్పారు. దేశాల తలరాతలను సంస్కృతే మార్చిందనీ, దేశాల మధ్య ఆర్థిక అంతరాల అన్వేషణకు సంస్కృతిలోకే తొంగిచూడాలని చెబుతూ మోకియర్ ఎన్నో ఉదాహరణలు ఇచ్చారు.


# బీహెచ్ఈఎల్ నుండి శబరిమల వరకు అయ్యప్ప భక్తుల పాదయాత్ర ప్రారంభం

## మాదిరి ప్రిథ్వీరాజ్ చేత జెండా ఊపి ప్రారంభం



సందేశం టైమ్స్ :సంగారెడ్డి టౌన్, అక్టోబర్ 24 :పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన అయ్యప్ప భక్తులు శుక్రవారం రోజు బీహెచ్ఈఎల్ అయ్యప్ప స్వామి ఆలయం నుండి శబరిమల అయ్యప్ప దేవాలయం వరకు మహా పాదయాత్రను ప్రారంభించారు. ఈ పవిత్ర యాత్రకు ప్రత్యేక అతిథిగా హాజరైన మాదిరి ప్రిథ్వీరాజ్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రిథ్వీరాజ్ మాట్లాడుతూ, “అయ్యప్ప స్వామి మాలధారణ భక్తుని ఆధ్యాత్మిక ప్రస్థానంలో అత్యంత ముఖ్యమైన దశ. ఇది మనసుకు ప్రశాంతతను, ఆత్మకు ఏకాగ్రతను ప్రసాదించి, భక్తి భావాన్ని బలపరుస్తుంది. అయ్యప్ప స్వామి ఉపదేశించే నియమం, నిష్ఠ, నియంత్రణ మన జీవన విధానంలో సాత్వికతను నింపుతాయి” అని అన్నారు.అలాగే, ఈ యాత్ర భక్తుల్లో సేవాభావం, సహనశీలత, ఆత్మనిగ్రహం వంటి విలువలను పెంపొందించే ఒక దివ్య అనుభూతిగా భావించవచ్చని తెలిపారు.యాత్రలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు “స్వామియే శరణం అయ్యప్ప” నినాదాలతో పరిసరాలను మార్మోగించారు. భక్తి, ఆధ్యాత్మికత నిండిన వాతావరణంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

# వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 24అక్టోబర్ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి హైదరాబాద్ నగరంలోని హైటెక్స్ వేదిక వద్ద జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్నారు.సంగారెడ్డి జిల్లా పటాన్‌చెర ప్రాంతానికి చెందిన ఎమ్మెల్సీ గోదావరి అంజి రెడ్డి గారి కుమారుని వివాహ మహోత్సవానికి హాజరైన సంజీవరెడ్డి గారు వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైపాల్ రెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆప్తులు పాల్గొన్నారు. వేడుక ఘనంగా నిర్వహించబడింది.

# ఎన్జీ రంగా వర్సిటీలో గోల్‌మాల్

**రూ.వందల కోట్ల నిధుల వినియోగంపై రికార్డులు తారుమారు**

**పాలక మండలి అనుమతి లేకుండానే ఫైనాన్స్ కమిటీ ఏర్పాటు**

**మొత్తం 92 పోస్టులు ఉంటే ఏకంగా 105 మందికి పదోన్నతులు**

**ఇన్‌చార్జి వీసీపై విజిలెన్స్‌కు వర్సిటీ ప్రొఫెసర్ ఫిర్యాదు**




(గుంటూరు సిటీ–అక్టోబరు24 (సందేశం టైమ్స్):ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిధుల గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వర్సిటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన రూ.వందల కోట్ల నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులను ట్యాంపరింగ్ చేస్తున్నారని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు అక్కడే పని చేస్తున్న ఒక ప్రొఫెసర్ ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి వీసీ శారదా జయలక్ష్మి తనకు అనుకూలమైన అధికారులను కీలకమైన స్థానాల్లో నియమించుకొని గతంలో జరిగిన అక్రమాలు బయటకు రాకుండా రికార్డులు తారుమారు చేస్తున్నారని ఆరోపించారు. వీసీ అవినీతి, అక్రమాలపై ఈ ఏడాది సెప్టెంబరులో గవర్నర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. చేసిన తప్పులు కప్పి పుచ్చుకునేందుకు అప్పటి వరకు వర్సిటీ రిజిస్ట్రార్‌గా ఉన్న జి.రామచంద్రరావును విచారణ ప్రారంభం కావటానికి ముందే సెప్టెంబరు 11న తొలగించారని వెల్లడించారు. రిజిస్ట్రార్‌ను తొలగించే విషయాన్ని పాలక మండలి సమావేశంలో చర్చించాల్సి ఉండగా ఇన్‌చార్జి వీసీ సొంత నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. ఆయన స్థానంలో మరో వ్యక్తిని నియమించారని, గతంలో కోరం లేకుండానే పాలక మండలి ద్వారా తీసుకున్న అనేక నిర్ణయాలను సరిచేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిలో భాగంగా నోట్ ఫైల్స్ తారుమారు చేస్తున్నారని, కొన్ని పత్రాలపై పాత తేదీలతో నోట్స్ రాస్తున్నారని ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు.

# విద్యుత్ కొనుగోళ్లలో వ్యూహాలు పాటించండి: సీఎస్



అమరావతి,అక్టోబరు24 (సందేశం టైమ్స్): విద్యుత్ కొనుగోళ్ల విషయంలో విద్యుత్ సంస్థలు ఆర్థిక పరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. ఈ ఏడాది నవంబరులో విద్యుత్ కొనుగోలుకు సంబంధించి విద్యుత్ సంస్థలతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. కొనుగోళ్లలో సమర్థవంతమైన ఆర్థికవ్యూహాలు పాటించాలని నిర్దేశించారు. నవంబరుకు 213 మిలియన్ యూనిట్ల విద్యుత్ అందుబాటులో ఉందని, గ్రిడ్ డిమాండ్ 218 మిలియన్ యూనిట్లుగా అంచనా వేశామని సీఎస్ తెలిపారు. రోజువారీ డిమాండ్ తీర్చడంలో పునరుత్పాదక విద్యుత్ ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తి 70 మెగావాట్ల నుంచి 1870 మెగావాట్లు, పవన విద్యుత్ 90 మెగావాట్ల నుంచి 400 మెగావాట్ల మధ్య ఉండబోతోందని చెప్పారు.

# మరో రెండు బీసీ కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

అమరావతి, అక్టోబరు24 (సందేశం టైమ్స్): రాష్ట్రంలో మరో రెండు బీసీ కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా రెడ్డి అనంతకుమారిని ఇప్పటికే ప్రభుత్వం నియమించింది. తాజాగా దేవళ్ల వెంకట్రాముడు(ఎమ్మిగనూరు), జి.అమర్నాథ్ (పుంగనూరు), గుబ్బళ్ల ఫణికుమార్(రాజోలు), అంగార రంగనాథ్(పెడన), దానరి తాతారావు(పలాస)లను డైరెక్టర్లుగా నియమించింది. కాగా, బెస్త సంక్షేమ కార్పొరేషన్‌గా చైర్మన్‌గా సూళ్లూరుపేటకు చెందిన బొమ్మన సుధీర్‌ను నియమించిన ప్రభుత్వం.. ఇప్పుడు 15 మంది డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బెస్త పవన్‌కుమార్(అనంతపురం అర్బన్), బెస్త శ్రీనివాసులు(ధర్మవరం), బెస్త మల్లికార్జున(డోన్), బెస్త మనోహర్(శ్రీసత్యసాయి), చంద్రశేఖర్(రాయచోటి), భాస్కర్‌రావు(కర్నూలు), కొడివర్తి శ్రీధర్(గూడూరు), మల్లె వెంకటసుబ్బయ్య(కమలాపురం), వి.అమరావతి(వ్రాతలవట్ట), వి.తిరుమగల్(కుప్పం), బొమ్మని పలాని(సూళ్లూరుపేట), వేటగిరి రాంప్రసాద్(కడప), బెస్త రామాంజనేయులు(ఆదోని), చావ సోమయ్య( బాపట్ల), టీజీ రమేశ్ బాబు(కర్నూలు)లను డైరెక్టర్లుగా నియమించింది.

# తల్లిదండ్రులను మత్తులో ఉంచి.. బాలికపై ఏడాదిగా అత్యాచారం

**శ్రీకాకుళం జిల్లాలో వెలుగుచూసిన దాష్టీకం**
**ఆటోడ్రైవర్‌తో పాటు, బాధితురాలి తల్లిపైనా పోక్సో కేసు**



రణస్థలం, అక్టోబరు24 (సందేశం టైమ్స్):తండ్రి అనారోగ్యాన్ని, తల్లి బలహీనతను ఆసరాగా చేసుకున్న ఓ వ్యక్తి వారి 14 ఏళ్ల కుమార్తెపై ఏడాదిగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో వెలుగుచూసిన ఈ దాష్టీకానికి సంబంధించి పోలీసుల కథనం మేరకు.. మండలంలో ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ.. స్థానిక పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆయన నిద్రపోవాలంటే అందుకు సంబంధించిన మాత్ర వేసుకోవాల్సిందే. ఆయన కుమార్తె పక్క గ్రామంలోని ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఇతర విద్యార్థులతో కలిసి ఆటోలో పాఠశాలకు వెళ్లి వస్తోంది. ఈ క్రమంలో ఆటోడ్రైవర్ పిన్నింటి రామారావు కన్ను ఆ బాలికపై పడింది. తండ్రి అనారోగ్య ఇబ్బందిని గ్రహించి, ఆపై బాలిక తల్లికి మద్యం అలవాటు చేశాడు. తల్లిండ్రులిద్దరూ మత్తులో ఉన్న సమయంలో బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. గత ఏడాదిగా ఈ దుశ్చర్య కొనసాగిస్తున్నాడు. ఓ రోజు అనుమానం వచ్చి తండ్రి మాత్ర వేసుకోలేదు. కుమార్తెపై ఆటోడ్రైవర్ లైంగిక దాడి చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నాడు. దీంతో బాలిక ఏడాదిగా జరుగుతున్న అఘాయిత్యాన్ని తండ్రికి చెప్పగా, జేఆర్‌పురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మద్యానికి బానిసగా మారిన బాలిక తల్లి కూడా ఈ విషయంలో ఆటోడ్రైవర్‌ను ప్రోత్సహించినట్టు పోలీసులు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలిక తల్లిపై, ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

# తోటల్లోనే కుళ్లిపోతున్న టమోటా

సోమల, అక్టోబరు24 (సందేశం టైమ్స్):పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో భారీగా నష్టపోతున్నామని సోమల మండల టమోటా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గార్గేయనదీ తీరంలోని రెడ్డివారిపల్లె, బోనమంద, చిన్నకమ్మపల్లె, పొలికిమాకులపల్లె గ్రామాల రైతులు టమోటాలను పుంగనూరు,పలమనేరు మార్కెట్లకు తరలించలేక నష్టపోతున్నారు. వర్షాలతో నాలుగు కల్వర్టులు కొట్టుకుపోవడంతో టమోటాలను తరలించలేక పోతున్నారు. దీంతో టమోటాలు తోటల్లోనే కాయలు కుళ్లి పోతున్నాయి. దీనికితోడు వర్షాలతో నల్ల మచ్చ వ్యాధి సోకి పంటనష్టం జరుగుతోంది. ఒకటి రెండుసార్లు కోతలు చేసినా ఆకులు రాలిపోతున్నాయి. ధరలు కూడా తగ్గిపోయాయి. 15 కిలోల బాక్సు రూ.150 నుంచి రూ. 200 లోపు మాత్రమే పలుకుతున్నాయి. పెద్దఉప్పరపల్లె, నెల్లిమంద. ఇరికిపెంట, నడింపల్లె, కందూరు ప్రాంతాల్లో టమోటా సాగు అధికంగా ఉన్నా.. పెట్టుబడులు సైతం చేతికందే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి రైతులు కూడా వాన కారణంగా కోత కోయలేకపోతున్నారు. పలుచోట్ల వరి పంట నీటమునిగి కుళ్లిపోతోంది. కొందరు ఒబ్బిళ్లు చేసినా పంటను రక్షించుకోలేకపోతున్నారు. వరి మొలకలు వస్తున్నాయని ఆందోళన పడుతున్నారు. వేరుశనగ పంట కూడా పొలాల్లోనే మొలక వస్తోంది. ఇతర తీగ పంటలు, కూరగాయల పంటలకు కూడా నష్టమే వస్తోందని రైతులు వాపోతున్నారు.

# కొండపై నిండు కుండలు..



**ఐదు జలాశయాలకు జలకళ**
**తిరుమలలో 204 రోజులకు సరిపడా నీరు**

తిరుమల,అక్టోబరు24 (సందేశం టైమ్స్):వారంరోజులుగా కురిసిన వర్షాలకు తిరుమలలోని ఐదు జలాశయాలు జలకళ సంతరించుకున్నాయి. వీటిలో 11,805.62 లక్షల గ్యాలన్ల నీరు నిల్వ ఉంది. గడిచిన వారం రోజుల్లోనే 4,417.91 లక్షల గ్యాలన్ల నీరు డ్యాముల్లోకి చేరింది. తిరుమల అవసరాలకు రోజుకు 50 లక్షల గ్యాలన్ల నీరు అవసరం. ఇందులో సగ భాగాన్ని తిరుమలలోని ఐదు డ్యాముల నుంచి.. మిగతా సగం తిరుపతిలోని కల్యాణి డ్యాం ద్వారా వినియోగించుకుంటారు. అల్పపీడనం ప్రభావంతో గత వారం రోజులుగా తిరుమలలో వర్షం కురుస్తునే ఉంది. దీంతో పాపవినాశనం, ఆకాశగంగ, గోగర్భం, కుమారధార, పసుపుధార డ్యాముల్లో వారం కిందట 51.64 శాతంగా ఉన్న నీటి నిల్వలు ప్రస్తుతం 82.54 శాతానికి చేరాయి. ఇక, తిరుపతిలోని కల్యాణి డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 56,775 లక్షల గ్యాలన్లు కాగా.. ప్రస్తుతం 5,925.15 లక్షల గ్యాలన్ల నీటి నిల్వలున్నాయి. తిరుమలలోని ఐదు జలాశయాలు, తిరుపతిలోని కల్యాణి డ్యామ్‌లో ఇప్పుడున్న నీటి నిల్వల్లో డెడ్ స్టోరేజీని మినహాయించి 204 రోజులకు (2026 మే 15వ తేదీ వరకు) తిరుమల అవసరాలకు సరిపడా జల వనరులు అందుబాటులో ఉన్నాయని టీటీడీ అంచనా వేస్తోంది.

# విషజ్వరాల బారిన కస్తూర్బా విద్యార్థినులు

గూడూరు (కర్నూలు జిల్లా) :అక్టోబరు24 (సందేశం టైమ్స్): కర్నూలు జిల్లా గూడూరులోని కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు విషజ్వరాల బారిన పడ్డారు. నాలుగు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన ఏడవ తరగతి విద్యార్థిని వడ్డే స్నేహ (13) చికిత్స పొందుతూ రాత్రి మరణించారు. ఈ సంఘటనపై కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ జరీనా తెలిపిన వివరాల ప్రకారంపాఠశాలలో ఐదవ తరగతి నుంచి ఇంటర్ వరకు 270 మంది విద్యార్థినులు చదువుతున్నారన్నారు. నాలుగు రోజుల క్రితం స్నేహ అనే విద్యార్థికి తీవ్ర జ్వరం రావడంతో ఆమె తల్లిదండ్రులకు సమాచారమిచ్చామన్నారు. వారు వచ్చి ఇంటికి తీసుకువెళ్లారని, కోడుమూరులో చికిత్స పొందుతూ విద్యార్థిని మరణించినట్లు తెలిసిందన్నారు. పాఠశాలలోని 30 మంది విద్యార్థులు తలనొప్పి, జలుబు, జ్వరంతో బాధపడుతున్నట్లు తెలియడంతో గూడూరు వైద్యులతో చికిత్స అందించామని తెలిపారు. వీరిలో నలుగురికి తీవ్రమైన జ్వరం రావడంతో ఆస్పత్రికి తరలించామన్నారు. విద్యార్థినులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల అనారోగ్యంపై గూడూరు వైద్యులను వివరణ కోరగా వారు సరైన సమాధానం చెప్పలేదు.

# ప్లీజ్.. సీసా స్కాన్ చేయండి

**మందుబాబులను బతిమాలుతున్న ఎక్సైజ్ కానిస్టేబుళ్లు**
**ఒక్కొక్కరు రోజుకు వంద స్కాన్ చేయించాలని టార్గెట్**
**అవగాహన పేరుతో అధికారుల ఆదేశాలపై విమర్శలు**
**మద్యం దుకాణాల వద్ద కానిస్టేబుళ్ల పడిగాపులు**

అమరావతి,అక్టోబరు24 (సందేశం టైమ్స్)::మద్యం సీసా లు ఒరిజినలా? కాదా? అని నిర్ధారించుకునేందుకు ఏపీ ఎక్సైజ్ శాఖ సురక్ష యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిపై వినియోగదారుల్లో అవగాహన పెంచుతోంది. యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి.. సీసాలు ఎలా స్కాన్ చేయాలనే సూచనలతో ప్రతి మద్యం దుకాణంలో పోస్టర్లు అతికిస్తోంది. అయితే, వినియోగదారులతో స్కాన్ చేయించే బాధ్యతను ఆ శాఖ కానిస్టేబుళ్లకు అప్పగించారు. ప్రతి కానిస్టేబుల్ వినియోగదారులతో స్కానింగ్ చేయించాలనే ఆదేశాలు అమల్లోకి వచ్చాయంటూ జిల్లాల అధికారులు ఈ కొత్త విధులను కానిస్టేబుళ్లకు అప్పగించారు. దీంతో 'ప్లీజ్.. సీసాలు స్కాన్ చేయండి' అంటూ కానిస్టేబుళ్లు షాపుల వద్ద మందుబాబులను బతిమాలుకునే పరిస్థితి ఏర్పడింది.

అవగాహన మంచిదే కానీ..

నకిలీ మద్యం పట్టుబడ్డ తర్వాత ఎక్సైజ్ శాఖ సురక్ష యాప్‌ను తీసుకొచ్చి వినియోగదారుల్లో అవగాహన కల్పిస్తోంది. కానీ మందుబాబులతో దగ్గరుండి స్కాన్ చేయించే బాధ్యతను కానిస్టేబుళ్లకు అప్పగించడం మరీ అతిగా ఉందనే విమర్శలు వస్తున్నాయి. ఒక్కో కానిస్టేబుల్ రోజూ కనీసం వంద మందితో సీసాలను స్కానింగ్ చేయించాలని జిల్లాల్లో అధికారులు టార్గెట్లు పెడుతున్నారు. ముందు వినియోగదారులతో యాప్ డౌన్‌లోడ్ చేయించి, ఆ తర్వాత స్కానింగ్ చేయించాలని ఆదేశిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇది మరీ ఎక్కువైంది. ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం ఆ జిల్లా పరిధిలోనే ఉండటంతో ఉన్నతాధికారుల మెప్పు కోసం అక్కడి అధికారులు మరింత అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. కాగా, పది మందిని అడిగితే అందులో ఇద్దరు ముగ్గురు మాత్రమే స్కాన్ చేస్తున్నారు.

# రహస్య డ్రోన్ సర్వేను అడ్డుకున్న గిరిజనులు



సరుబుజ్జిలి (శ్రీకాకుళం జిల్లా) :అక్టోబరు24 (సందేశం టైమ్స్): థర్మల్ ప్లాంట్ ప్రతిపాదిత గ్రామాల్లో రహస్యంగా డ్రోన్ సర్వే చేస్తున్న అధికారులను గిరిజనులు అడ్డుకున్నారు. శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస వద్ద థర్మల్ ప్లాంట్ ప్రతిపాదిత గ్రామాల్లో అధికారులు రహస్యంగా డ్రోన్ సర్వే చేపట్టారు. నవోదయ విద్యాలయం లోపల నుంచి సర్వే చేపట్టగా, డ్రోన్లను గమనించిన గిరిజనులు పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. విద్యాలయం గేటు వద్ద బైఠాయించి ప్లాంట్ సర్వేకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. దీంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఆమదాలవలస సిఐ పి సత్యనారాయణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో వచ్చి గిరిజనులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. లోపల ఉన్న అధికారులు బయటకు రావాలని, రహస్య సర్వే ఎందుకు చేస్తున్నారో చెప్పాలని గిరిజనులు పట్టుబట్టారు. సర్వే అధికారులను బయటకు పంపకపోతే తాము ఇక్కడ్నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం దొంగచాటుగా సర్వేలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# స్వయం సహాయంలో ఏపీ ఫస్ట్

**మహిళా సంఘాలకు రుణాలివ్వడంలో అగ్రస్థానం**
**దేశంలోనే అత్యధికంగా రూ.34.83 లక్షల కోట్ల పంపిణీ**
**రెండు, మూడు స్థానాల్లో నిలిచిన ఉత్తరప్రదేశ్, బిహార్**



న్యూఢిల్లీ,అక్టోబరు24 (సందేశం టైమ్స్): స్వయం సహాయక సంఘాల మహిళల సంక్షేమంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. మహిళా సాధికారత, సంఘాలకు రుణాల అందజేయడంలో రోల్ మోడల్‌గా మారింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో మహిళా సాధికారత, రుణాల అందజేత, వ్యాపారాభివృద్ధి తదితర అంశాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళుతోంది. మహిళా బృందాల్లోని సభ్యులకు పెద్దఎత్తున రుణాలు ఇవ్వడంతోపాటు వాటి ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో ఏపీ మొదటిస్థానంలో నిలిచింది. స్వయం సహాయక సంఘాల ద్వారా ఆంధ్రప్రదేశ్ రూ.34,83,725 కోట్లు అందజేసి అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో రూ.1,23,326 కోట్లు అందజేసి ఉత్తరప్రదేశ్ రెండోస్థానంలో, రూ.1,05,132 కోట్లు పంపిణీ చేసి బిహార్ మూడోస్థానంలో నిలిచాయి. అలాగే, స్థిరమైన జీవనోపాధిని ప్రోత్సహించడం, వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలకు సంబంధించి మహిళా రైతులను ప్రోత్సహించడంలోనూ ఆంధ్రప్రదేశ్ తనదైన ముద్ర వేసింది. 12,97,051 మంది మహిళ లకు చేయూతనిచ్చి మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలవగా, 11,37,950 మంది మహిళా రైతులను మద్దతుగా నిలిచి ఉత్తరప్రదేశ్ రెండోస్థానంలో ఉంది. 10,43,085 మంది మహిళా రైతులకు చేయూతనిచ్చి ఆంధ్రప్రదేశ్ మూడోస్థానంలో నిలిచింది.

# అదాని సిమెంట్ ఫ్యాక్టరీ రద్దుకు వామపక్షాల ధర్నా



గాజువాక (విశాఖపట్నం) అక్టోబరు24 (సందేశం టైమ్స్): ప్రజలకు, పర్యావరణానికి హాని కలిగించే అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని విశాఖ గాజువాకలోని పెదగంట్యాడలో ఏర్పాటు చేయొద్దంటూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెదగంట్యాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఏర్పాటును రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చేత స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయమే ఫైనల్ అని పల్లా చెబుతున్నారని, ఆ మాటకు కట్టుబడి ఉండి, చిత్తశుద్ధితో వ్యవహరించి ప్యాక్టరీని రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా నాయకులు కె సత్యనారాయణ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఏరియా కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ ప్రజా పోరు జిల్లా కార్యదర్శి కె దేవసహాయం మాట్లాడుతూ ఇప్పటికే గంగవరం పోర్టుతో గాజువాక నియోజవర్గం మొత్తం కాలుష్యమయమై ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే గాజువాక నివాసయోగ్యంకాని ప్రాంతంగా మారుతుందన్నారు. నగరంపైనా కాలుష్య ప్రభావం ఉంటుందన్నారు. ధర్నా అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# కాలం చెల్లిన పైపులైన్‌తో తాగునీటి కష్టాలు

పొదిలి :అక్టోబరు24 (సందేశం టైమ్స్):పొదిలి పట్టణంలో కాలం చెల్లిన పైపులైన్లతో ప్రజల దాహార్తి తీరడం లేదు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఎన్‌ఎపి పథకం పైపులైన్‌కు కాలం చెల్లింది. తరచూ మరమ్మతులకు గురవుతుంది. దీంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. 1981లో పొదిలి సమీపంలోని పద్దులగిరి లక్ష్మీనరసింహస్వామి కొండను ఓ విమానం ఢకొని కూలిపోయింది. ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు అప్పటి గవర్నర్ కుముద్ బెన్ జోషి వచ్చారు. పొదిలి సమీపంలోని రాజుపాలెం గ్రామస్తులు ఫ్లోరింగ్ నీటితో నడుములు వంగిపోయి ఉ ఒడడాన్ని గమనించారు. గ్రామస్తులతో మాట్లాడారు.



చేతి పంపుల ద్వారా వచ్చే ఫ్లోరిన్ నీటిని తాగి తాము ఈ దుస్థితిలో ఉన్నామని గ్రామస్తులు వివరించారు. స్పందించిన కుముద్‌బెన్ జోషి పొదిలి ప్రాంతంలో భూగర్భ జలాలపై వాస్తవ పరిస్థితి తెలుసుకున్నారు. కనీసం తాగేందుకు సాగర్ జలాలను ఇవ్వాలని సంకల్పించి ప్రతిపాదన తయారు చేయించారు. ఆమె సహకారంతో నెదర్లాండ్ ప్రభుత్వ ఆర్థిక సహాయంతో మంచి నీటి పథకం రూపుదిద్దుతుంది. ఈ రెండు గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఫ్లోరిన్ సమస్య నివారణ కోసం మంచి నీటిని సరఫరా చేసేందుకు దర్శి వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నుంచి శుద్ధిచేసిన మంచి నీటిని సరఫరా చేసేవారు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పైప్ లైన్లు భూగర్భంలో పది అడుగుల లోతులో ఉంది. కాలం చెల్లి పైపులు పగిలిపోతున్నాయి. ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు.

# 'ఆరోగ్యశ్రీ' ఆసుపత్రుల యాజమాన్యాల ఉద్యమబాట

అమరావతి బ్యూరో :అక్టోబరు24 (సందేశం టైమ్స్):ఆరోగ్య శ్రీ (ఎన్‌టిఆర్ వైద్యసేవ) పథకం అమల్లేస్తున్న నెట్‌వర్క్ ఆసుపత్రులు యజమానులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యక్ష ఆందోళనకు దిగారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వైద్య సేవలందించినందుకు గాను తమకు రావాల్సిన బకాయిలు కోట్లాది రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిల్లో కనీసం రూ.650 కోట్లు అయినా తమ ఖాతాల్లో జమ చేయాలని, లేదంటే సేవలందించసాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల తాము ఆసుపత్రులను మూసివేయాల్సిన పరిస్థితి నెలకొందని అసోసియేషన్ అధ్యక్షులు విజరు కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. తాము ఎదురు పెట్టుబడి పెట్టి పేదలకు వైద్య సేవలందించామని తెలిపారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో తమ సిబ్బందికి అప్పులు చేసి జీతాలు ఇవ్వాల్సివస్తోందన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడుతున్న తమ కష్టాలను ప్రభుత్వం గుర్తించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పేషంట్ డిశ్చార్జి అయినప్పటి నుంచి బిల్లు మంజూరు, విడుదల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి దాపురిస్తోందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.2600 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బుధవారం ప్రకటించిన రూ.250 కోట్లను తాము అంగీకరించడం లేదన్నారు. పూర్తి బకాయిలు



చెల్లించేవరకు తమ ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు. పెండింగ్ బకాయిల్లో తక్షణమే రూ.650 కోట్లను వెంటనే విడుదల చేయాలని, మిగిలిన బకాయిల చెల్లింపునకు కార్యాచరణ ప్రకటించాలని కోరారు. వన్‌టైం సెటిల్‌మెంట్‌కు కూడా తాము సిద్ధంగానే ఉన్నామని తెలిపారు. రాష్ట్రంలో మెరుగైన నూతన వైద్య విధానాన్ని రూపొందించేందుకు జరిగే చర్చల్లో తమ భాగస్వామ్యం కావాలని కోరారు. మెరుగైన ప్యాకేజీలను ఆచరణ సాధ్యమయ్యే విధంగా రూపొందించాలని తెలిపారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల బిల్లులను ప్రతి నెల చెల్లించాలని కోరారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



నంద్యాల కలెక్టరేట్ అక్టోబరు24 (సందేశం టైమ్స్): మొక్క జొన్న రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నంద్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ రాజశేఖర్, టి రామచంద్రుడు మాట్లాడుతూ మొక్కజొన్న పంటను కొనుగోలు చేయడానికి అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.2,400 వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధిక వర్షంవల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రైతులందరికీ పంటల బీమా వర్తింప చేయాలని, వర్షాలు వచ్చినప్పుడు ధాన్యం తడవకుండా ఉ ఒడేందుకు ఉచిత టార్పాలిన్ పట్టలు ఇవ్వాలని కోరారు. ప్రతి గ్రామంలో రైతుల పంటలు ఆరబోసుకునేందుకు స్థలాన్ని కేటాయించాలని, గోదాములు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ జి రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరిగిన పంట నష్టంపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాథమిక అంచనా పంపామన్నారు. పూర్తిస్థాయి విచారణ నిమిత్తం జిల్లాలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నివేదిక తయారు చేస్తామన్నారు. రైతులందరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి సుబ్బరాయులు, టి వెంకటేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శులు ఎ సురేష్, పి రామ్మోహన్, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# తెలుగు విశ్వవిద్యాలయం తొలి వీసీగా మునిరత్నం నాయుడు బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం,అక్టోబరు24 (సందేశం టైమ్స్): శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తొలి వైస్‌చాన్సలర్‌గా ఆచార్య డి.మునిరత్నం నాయుడు బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం (బొమ్మూరు పీఠం)లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రార్, ఇతర ప్రధాన విభాగాల అధికారులు, ఇతర సిబ్బంది నియామకాలు పూర్తి చేసి, జనవరి నాటికి పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు. ఈ విశ్వవిద్యాలయం పరిధిలో 22 ముఖ్య విభాగాలు ఉన్నాయని, అందులో భాషాపీఠం, చరిత్ర-సంస్కృతి పీఠం ముఖ్యమైనవని తెలిపారు. విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశపెట్టనున్నట్టు చెప్పారు. రాజమహేంద్రవరం కేంద్రంలో తెలుగు ఎం.ఏ, శ్రీశైలంలో సంస్కృతి-చరిత్ర విభాగాల్లో ఎంఏ, పీహెచ్‌డీ, కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రంలో నృత్యానికి సంబంధించిన సర్టిఫికెట్, డిప్లమో కోర్సులు ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వైభవం దిశగా అడుగులు వేస్తోందన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి కోసం తన పరిధిలో రూ.30 లక్షలు నిధులు సమీకరించినట్టు చెప్పారు. రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ త్వరలో విశ్వవిద్యాలయాన్ని సందర్శించి అవసరమైన గ్రాంట్ విడుదల చేయనున్నట్టు ఆయన వివరించారు.

# విశాఖలో కంటైనర్ మెగా పోర్టు

అమరావతి అక్టోబరు24 (సందేశం టైమ్స్): విశాఖపట్నంలో కంటైనర్ మెగా పోర్టును ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సూచించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తో నీతిఅయోగ్ సిఇఓ సుబ్రహ్మణ్యం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఈ మేరకు సూచించారు. తూర్పుతీరంలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందున్నట్లు ఆయన చెప్పారు. కేంద్రం అమలు చేస్తున్న పూర్వోదయ పథకం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించిన ఆయన అందులో భాగంగానే విశాఖ గ్రోత్ హబ్ పైనా చర్చించారు. ఈ పథకం ద్వారా తీర ప్రాంతంలో అనేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆస్కారం ఉందన్నారు. రాష్ట్రంలో అనేక ఓడరేవులు ఉన్నప్పటికీ వాటికి అదనంగా కంటైనర్ మెగా పోర్టును ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు. త్వరలో జరగనున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమావేశంలో సమగ్రాభివృద్ధిపై చర్చ ఉంటుందని సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఇందుకోసం వినూత్న పథకాలపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చేందుకు వీలుగా



నివేదికను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఇదే సమయంలో విశాఖ, అమరావతి, తిరుపతి గ్రోత్ కారిడార్ల ఏర్పాటు, దానివల్ల కలిగే ప్రయోజనాల పైనా సమీక్షించారు. సిఎస్ విజయానంద్ మాట్లాడు తూ విశాఖ గ్రోత్ హబ్ పనుల వేగవంతానికి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన నిధులు వచ్చేలా నీతి ఆయోగ్ సిఫార్సు చేయాలని సుబ్రహ్మణ్యంను కోరారు.

# మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

రాజమహేంద్రవరం అక్టోబరు24 (సందేశం టైమ్స్): సిటీ గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించినట్లు కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో పుష్కరాల ముందస్తు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. 2027 జూలైలో నిర్వహించే పుష్కరాలకు అధికార యంత్రాంగం ఇప్పటినుంచే అప్రమత్తంగా ఉ ఒడాలని అన్నారు. చేపట్టవలసిన పనులు, అంచనా వ్యయంపై ప్రణాళికలను సిద్ధం చేయాలని అన్ని విభాగాల హెచ్ఓడిలను ఆదేశించారు. పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాది భక్తులకు అనుగుణంగా ఘాట్ల విస్తరణ, రహదారుల విస్తరణ, జంక్షన్ల అభివృద్ధి, పార్కింగ్ సహా అన్ని వసతుల కల్పన కోసం నివేదికలను రూపొందించాలని అన్నారు.



దీర్ఘకాలిక, మధ్య, స్వల్పకాలిక పనులను విడివిడిగా గుర్తించాలన్నారు. మహా కుంభమేళాతో పాటు గతంలో వివిధ రాష్ట్రాల్లో పుష్కరాలు, భక్తులకు అవసరమైన సౌకర్యాల రూపకల్పనలో అనుభవమున్న కన్సల్టెన్సీలతో మాట్లాడాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, ఇన్‌ఛార్జ్ ఎస్ఇ రీటా, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, మేనేజర్ ఎండి అబ్దుల్‌మాలిక్, ఇఇ మదర్షా అలీ, మాధవి, ఇన్‌ఛార్జ్ సిఎంఓహెచ్ రవితేజ, అకౌంటెంట్ నాగమణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 9 మంది గంజాయి విక్రేతలు అరెస్టు

పొన్నూరుఅక్టోబరు24 (సందేశం టైమ్స్): పట్టణానికి సమీపంలో వివిఎస్ కాలేజీ సమీపంలో డొంక రోడ్డులో గుబురు చెట్ల మధ్య గంజాయి విక్రయిస్తున్న, సేవిస్తున్న ముఠాపై పోలీసులు దాడి చేశారు. మొత్తం 12 మందిని పోలీసులు గుర్తించగా వీరిలో ముగ్గురు పరారయ్యారు. 9 మందిని పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుండి కిలోకుపైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిని విచారణ చేయగా బాపట్ల మండలం వెదుళ్లపల్లి గ్రామానికి చెందిన ప్రసన్నకుమారి గంజాయి విక్రయిస్తున్నట్లు ప్రధాన నిందితుడు మర్రిసాయి మణికంఠరెడ్డి తెలిపాడు. మహిళ వద్ద గంజాయిని తీసుకుని కత్తి యశ్వంత్, పోలవరపు అజరు, ఏకశిరి సూర్యనారాయణ, కంబాల శ్రీనాథ్‌రెడ్డి తదితరులకు విక్రయించినట్లు చెప్పాడు. వారు ఆ గంజాయిని తిరిగి షేక్



షబ్బీర్, ఆలూరి వెంకట మణిరత్నం, మోపర్తి దేవదాసు, ప్రసాదం తరుణ్ కుమార్, విన్నకోట భరత్ కళ్యాణ్ మొదలైన వారికి 5 గ్రాముల ప్యాకెట్ రూ.500 చొప్పున విక్రయించారని విచారణలో తేలినట్లు పట్టణ సిఐ ఎల్. వీరానాయక్, ఎస్ఐ వి.శ్రీహరి తెలిపారు. సాయి మణికంఠరెడ్డి, యశ్వంత్, సూర్యనారాయణ, శ్రీనాథ్‌రెడ్డి, షబ్బీర్, వెంకట మణిరత్నం, దేవదాసు, తరుణ్ కుమార్, భరత్ కళ్యాణ్‌ను అరెస్టు చేశామని, అజరు, ప్రసన్నకుమారి, ప్రశాంత్ పరారీలో ఉన్నారని చెప్పారు.

# అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందజేత

నార్నూర్ అక్టోబరు24 (సందేశం టైమ్స్): ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం జీన్ గూడ కాలనీకి చెందిన వాగ్మా రే ఆనంద్ రావు అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ బాధితుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో



వార్డ్ మాజీ మెంబర్ శాంతారావ్, అరవింద్, రవీందర్, సాంభాజి, దేవదాస్, రెహమాన్, బీమా మహారాజ్, ప్రకాష్ తదితరులున్నారు.

# సినీ షూటింగ్ స్పాట్‌గా హెచ్ఎంటీ ఫారెస్ట్

హైదరాబాద్:అక్టోబరు24 (సందేశం టైమ్స్): కుత్బుల్లాపూర్ నియోజకవర్గపరిధిలోని హెచ్ఎంటీ అటవీ ప్రాంతం సినిమా షూటింగ్‌ల స్పాట్‌గా మారింది. వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతం షూటింగ్‌లకు అనుకూలంగా ఉండడంతో వెబ్ సిరీస్ లు, ప్రైవేట్ ఆల్బమ్‌లు, చిన్నా, పెద్ద సినిమాలను ఇక్కడే తీస్తున్నారు. తమ అభిమాన నటీ, నటులను చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో ఈ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంటోంది.

%నాలుగు నెలల క్రితం మారేడుమిల్లి పోలీస్ స్టేషన్ బకాసుర రెస్టారెంట్ సినిమాల షూటింగ్ హెచ్ఎంటీ ఫారెస్ట్ ప్రాంతం లో జరిగింది. తాజాగా లేడీ ఓరియెంటెడ్ సినిమా మైస షూటింగ్ జరిగింది. గురువారం అర్ధరాత్రి వరకు కొత్త బంగారు లోకం హీరో వరుణ్ సందేశ్, సత్యం రాజేష కలయికలో కొత్త సినిమాను శ్మశానవాటిక సెట్‌లో తీశారు. శ్మశానవాటికతో పాటు అక్కడ వేసిన



కాటికాపరి గుడిసె, శివుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా ఉండడంతో ప్రజలు చూసేందుకు వస్తున్నారు.

# పెద్దపల్లిలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మెడికల్ షాపుల తనిఖీ



పెద్దపల్లి,అక్టోబరు24 (సందేశం టైమ్స్): పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని పలు మెడికల్ షాపులను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రవణ్‌కుమార్ ఆకస్మీకంగా తనిఖీ చేశారు. నాలుగు రోజుల క్రితం ఓ మెడికల్ షాపు నిర్వాహకుడు కల్తీ సిరప్ ఇచ్చాడని పెద్దపల్లి పట్టణానికి చెందిన చిరంజీవి ఫిర్యాదు చేశాడు. కాగా ఆ మెడికల్ షాపును డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రత్యేకంగా తనిఖీ చేశారు. %మెడికల్ షాపులో మందులు, రిజిస్టర్లు పరిశీలించారు. అలాగే బాధితుని వద్ద నుంచి సిరప్‌ను సేకరించి, సీల్ చేసి ల్యాబ్‌కు పంపి, ల్యాబ్ నుంచి వచ్చిన రిజల్ట్? అధారంగా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మెడికల్ షాప్ నిర్వాహకులు మెడిసిన్ తీసుకునే ప్రతీ ఒక్కరికీ బిల్లు ఇవ్వాలని లేదంటే చర్యలు తప్పవని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# తెలుగు రాష్ట్రాలకు అలర్ట్.. నేడు భారీ వర్షాలు..




హైదరాబాద్:అక్టోబరు24 (సందేశం టైమ్స్): నేడు రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వర్షాకాలం ఇంకా ముగియలేదని.. మరి కొన్ని రోజులు వానలు కురుస్తాయని హెచ్చరించింది. వాస్తవానికి ఈ సమయానికి వర్షాకాలం ముగిసి శీతాకాలం ప్రారంభం కావాల్సి ఉంది. కానీ ఈ సంవత్సరం మాత్రం అందుకు భిన్నంగా పలు జిల్లాలో ఇప్పటికే.. వానలు కురుస్తున్నాయి.తెలంగాణలోని నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి - భోంగిర్, మెదక్, సిద్ధిపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నేడు ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. వివిక్త ప్రదేశాలలో భారీ వర్షాలు కురుస్తాయి పేర్కొంది. అలాగే.. హైదరాబాద్ నగరంలో (శుక్రవారం) మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. కావున నగర ప్రజలు పనులు ముగించుకుని త్వరితగతిన ఇంటికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాలతో పాటు యానాంలో అతి భారీ నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాయలసీమలోనూ పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోందని పేర్కొంది. ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఇప్పటికే మోస్తారు వర్షం కురుస్తున్నట్లు సమాచారం. వర్షాల నేపథ్యంలో రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అప్రమత్తం అయ్యాయి. ముందస్తు చర్యలకు సిద్ధం కావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

# బచ్చన్నపేటలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

బచ్చన్నపేట, అక్టోబరు24 (సందేశం టైమ్స్):బచ్చన్నపేట మండలం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నిర్వహించారు. 2024 ఆగస్ట్ 2025 వరకు రూ.5 కోట్లతో జరిగిన వివిధ పనులపై బృందాలు తనిఖీలు నిర్వహించారు. డీఆర్‌డీవో చంద్రశేఖర్ సామాజిక తనిఖీ వేదికలో పలు అంశాలపై మాట్లాడారు. సభ్యులు తనిఖీ నివేదికలను అధికారులకు చదివి వినిపించారు. పంచాయతీ కార్యదర్శులు, టీఏలు సక్రమంగా విధులు నిర్వహించడం లేదన్నారు.%పలు గ్రామాల్లో అన్ని రిజిష్టర్‌లను మెయింటైన్ చేయడం లేదని తెలిపారు. అనంతరం డీఆర్‌డీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తనిఖీల్లో పనులు జరిగిన చోట ఫీల్డ్ అసిస్టెంట్లు మొబైల్ ఆన్‌లైన్ చేయడంపై కొందరు 85 శాతం వరకు పనిచేస్తే.. మరికొన్ని గ్రామాల్లో



కొందరు 10 శాతం పనులను మాత్రమే ఆన్‌లైన్ చేశారు. నిర్లక్ష్యం చేసిన కార్యదర్శులకు, సీసీలు ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు.రికార్డుల పరంగా రూ.2,78,651 పెనాల్టీ రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అంబికా సోనీ, ఎంపీడీవో మమతా బాయ్, ఎంపీవో మల్లికార్జున్, డీవీసీ సంధ్యా ప్రణయ్, క్యూసి శాఖ రాజవర్ధన్, ఎస్ఆర్పి నరేందర్, ఈసీ శ్రీనివాస్ రెడ్డి, ఏపీవో కృష్ణ , కార్యదర్శిలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు



హైదరాబాద్, అక్టోబరు24 (సందేశం టైమ్స్): ఈసారి ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి ఆఖర్లో నిర్వహించనున్నారు. ఇప్పటివరకు ప్రతి ఏటా మార్చి మొదటి వారంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గతేడాది మార్చి5న ప్రారంభమైన పరీక్షలు 25న ముగిశాయి. అయితే ఈ విద్యా సంవత్సరంలో మాత్రం ఫిబ్రవరి 25 నుంచి ప్రథమ, 26 నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇక ప్రాక్టికల్ పరీక్షలు జనవరి ఆఖర్లో ప్రారంభించి ఫిబ్రవరి మొదటివారంలో పూర్తి చేయనున్నారు. ఈ పరీక్షలను రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో నిర్వహించనున్నారు. పరీక్షల షెడ్యూల్‌తోపాటు ఫీజులకు సంబంధించి ఇంటర్ బోర్డు చేసిన ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. పరీక్షలు ముందుగా నిర్వహిస్తే సెకండియర్ విద్యార్థులు ఎప్‌సెట్, ఐఐటీలాంటి పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమయ్యేందుకు మరింత సమయం లభించనుంది. అలాగే పరీక్షలు ముందుగా ముగించి ఫలితాలు ప్రకటిస్తే.. కొత్త విద్యా సంవత్సరంలో ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థుల ప్రవేశాల పెంపుపై అధ్యాపకులు పూర్తిగా దృష్టిసారించే అవకాశాలుంటాయని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఇకఈసారి ప్రాక్టికల్ పరీక్షలకు ఒక్కో విద్యార్థికి రూ.30 చొప్పున వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈసారి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రైవేటు కాలేజీల్లో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థి నుంచి రికగ్నిషన్ ఫీజు రూ.220, గ్రీన్ ఫండ్ ఫీజు రూ.15 చొప్పున వసూలు చేయాలని ఇంటర్ విద్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఉత్తర్వులు జారీచేశారు.

# 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



దేవరకొండ రూరల్,అక్టోబరు24 (సందేశం టైమ్స్): అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని దేవరకొండ పోలీసులు పట్టుకున్నారు. దేవరకొండ ఎస్ఐ పి.వెంకట్ రెడ్డి తెలిపిన సమాచారం ప్రకారం.. దేవరకొండ శివారులో పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా చింతపల్లి మండలం నసర్లపల్లి గ్రామం నుండి దేవరకొండ వైపు వెళ్తున్న టాటా ఏసీ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. దీంతో 50 బస్తాల్లో 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమ తరలింపు బహిర్గతమైనట్లు తెలిపారు. వాహన డ్రైవర్‌ను ప్రశ్నించగా నసర్లపల్లి గ్రామానికి చెందిన షేక్ మురియాబి ప్రజల వద్ద రేషన్ బియ్యంను తక్కువ ధరకు కొని నాగర్ కర్నూలు జిల్లా వంగూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామంలోని నాయిని సంపదయ్యకు అమ్ముతున్నట్లు తెలిపాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు

# మహిళపై బీబీనగర్ ఎయిమ్స్ సిబ్బంది దాడి



బీబీనగర్,అక్టోబరు24 (సందేశం టైమ్స్): తనపై బీబీనగర్ ఎయిమ్స్ సిబ్బంది దాడి చేశారని ఓ మహిళ ఆరోపించింది. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా చెంగిచెర్ల, శ్రీనివాస్‌నగర్‌కు చెందిన తేజావత్ విజయ అనారోగ్యంతో బాధపడుతు వైద్యం చేయించుకోవడానికి మధ్యాహ్నం ఎయిమ్స్‌కు వచ్చింది. ఆస్పత్రిలో ఓపి తీసుకుంటుండగా కౌంటర్‌లో ఉన్న ఓపి ఆపరేటర్ అకారణంగా తనను బూతులు తిట్టాడని, సెక్యూరిటీని పిలిచి బయటకు నెట్టివేశారని, అక్కడ ఉన్న మహిళా సెక్యూరిటీ తనను కొట్టిందని తెలిపింది.

# చారిత్రక ఓరుగల్లు కోటలో సదర్ సంబురాలు

ఖిలావరంగల్:అక్టోబరు24 (సందేశం టైమ్స్): చారిత్రక కాకతీయ వైభవానికి ప్రతీకగా నిలిచే ఓరుగల్లు కోట, యాదవుల సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ జరిగిన 'దున్న రాజుల సంబురాలు'తో దద్దరిల్లింది. దున్నపోతులకు ప్రత్యేక అలంకరణ చేసి కోట పురవీధుల్లో ఊరేగించడం, వాటి విన్యాసాలు ప్రదర్శించడం ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సాంస్కృతిక ఘట్టం కేవలం వినోద కార్యక్రమం మాత్రమే కాకుండా, స్థానిక సంస్కృతి, సామాజిక ఐక్యత, చారిత్రక వారసత్వ పరిరక్షణకు ఎంతగానో దోహదపడింది.?ఓరుగల్లు కోట కాకతీయ రాజుల రాజసం, శిల్పకళా నైపుణ్యానికి నిలువుటద్దం. అటువంటి చారిత్రక వేదికపై యాదవుల సంస్కృతికి సంబంధించిన 'దున్న రాజుల సంబరాలు' నిర్వహించడం వలన, ఈ కోట కేవలం శిథిలమైన కట్టడాల సముదాయం కాకుండా, సజీవ సంస్కృతికి కేంద్రంగా మరోసారి నిరూపితమైంది. యాదవుల జీవనంలో పశుసంపదకు, ముఖ్యంగా దున్నపోతులకు ఉన్న ప్రాధాన్యతను ఈ సంబరాలు చాటిచెబుతాయి. సంప్రదాయ దుస్తులు, ఆటపాటలతో కూడిన ఈ వేడుకలు ఒక నిర్దిష్ట సామాజిక వర్గం యొక్క జీవనశైలిని, ఆచారాలను నగర ప్రజలకు పరిచయం చేశాయి.



ప్రత్యేక ఆకర్షణగా దున్న రాజుల విన్యాసాలు

?ఈ వేడుకలకు 'దున్న రాజులు' ప్రధాన కేంద్రంగా నిలిచారు. పటిష్టమైన శరీరంతో, రంగురంగుల అలంకరణలతో మెరిసిపోతున్న దున్నపోతులను పురవీధుల్లో ఊరేగించడం అద్భుతమైన దృశ్యం. వాటి విన్యాసాలు, వాటిని నియంత్రించే యాదవుల నైపుణ్యం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇది కేవలం ప్రదర్శన మాత్రమే కాదు, గ్రామీణ ప్రాంతాల్లోని పశుపోషణ సంస్కృతి, పశువులతో మనుషులకు ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుంది. ఈ విన్యాసాలు పౌరులకు కొత్త అనుభూతిని ఇవ్వడమే కాకుండా, స్థానిక జానపద కళలను పరిరక్షించాల్సిన ఆవశ్యకతను గుర్తుచేశాయి.




# క్రీడావార్తలు




# అడిలైడ్‌లోనూ అదే తీరు రెండో వన్డేలో టీమిండియా ఓటమి

17 ఏళ్లుగా అడిలైడ్‌లో భారత జట్టుకు ఓటమి లేదు.. పైగా ఇక్కడ వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచిన అనుభవం.. అంతేకాకుండా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీకి అచ్చొచ్చిన మైదానం. ఇన్ని అనుకూలతల మధ్య రెండో వన్డే బరిలోకి దిగిన టీమిండియా కచ్చితంగా నెగ్గి సిరీసలో నిలుస్తుందనుకున్న ఆశలు అడియాశలే అయ్యాయి. రోహిత్ ఆకట్టుకున్నా, విరాట్ రెండోసారీ డకౌట్ కాగా.. అటు వరుసగా రెండు విజయాలతో ఆతిథ్య ఆసీస్ జట్టు సిరీస్ కూడా దక్కించుకుంది.అడిలైడ్: అత్యంత పటిష్టమైన జట్టుతో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన టీమిండియాకు మరో పరాభవం. ఒత్తిడిని అధిగమిస్తూ వెటరన్ స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ (73) బ్యాటింగ్‌లో చెలరేగినా.. బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఫలితంగా గురువారం జరిగిన రెండో వన్డేలో ఆసీస్ రెండు వికెట్ల తేడాతో నెగ్గింది. అలాగే మూడు వన్డేల ఈ సిరీసను మరో మ్యాచ్ ఉండగానే 2–0తో దక్కించుకుంది. నామమాత్రపు ఆఖరి వన్డే శనివారం సిడ్నీలో జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 264 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (61), అక్షర్ పటేల్ (44), హర్షిత్ (24 నాటౌట్) రాణించారు. స్పిన్నర్ ఆడమ్ జంపాకు నాలుగు, పేసర్లు బార్ట్‌లెట్‌కు మూ డు, స్టార్క్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 46.2 ఓవర్లలో 265/8 స్కోరుతో గెలిచింది. షార్ట్ (74), కూపర్ (61 నాటౌట్) అదరగొట్టారు. సుందర్, అర్ష్‌దీప్, హర్షిత్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఆడమ్ జంపా నిలిచాడు.కూపర్ అజేయంగా..: ఈ పిచ్‌పై 265 పరుగుల ఛేదన కష్టమే అనిపించినా వన్‌డౌన్ బ్యాటర్ మాథ్యూ షార్ట్, మిడిలార్డర్‌లో 22 ఏళ్ల కూపర్ కనోలీ, ఓవెన్ సులువు చేశారు. భారత బౌలర్లు చివర్లో వికెట్లు తీసి ఉత్కంఠ నెలకొల్పినా.. ఛేదనకు పుష్కలంగా బంతులు మిగిలి ఉండడంతో ఆసీసకు ఇబ్బంది ఎదురుకాలేదు. ఓపెనర్లు హెడ్ (28), మార్ష్ (11) విఫలమయ్యారు. అయితే షార్ట్ మాత్రం రెన్షా (30)తో మూడో వికెట్‌కు 55, కూపర్‌తో ఐదో వికెట్‌కు 55 రన్స్ జోడించి 36వ ఓవర్‌లో వెనుదిరిగాడు. ఆ తర్వాత కూపర్ బాధ్యత తీసుకుని హాఫ్ సెంచరీతో అజేయంగా నిలిచాడు. ఓవెన్ సహకారంతో ఆరో వికెట్‌కు 59 పరుగులు జోడించాడు. చివర్లో విజయానికి 34 బంతుల్లో 10 రన్స్ కావాల్సిన వేళ 2 వికెట్లు కోల్పోయినప్పటికీ.. కూపర్ మరో 22 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

ఆదుకున్న రోహిత్–శ్రేయాస: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ స్కోరు 250 దాటగలిగిందంటే రోహిత్ శర్మ పోరాటమే కారణం. అతడికి శ్రేయాస్ సహకరించడంతో మూడో వికెట్‌కు 118 పరుగులు సమకూరాయి. అయితే ఆరంభంలో రోహిత్ తీవ్రంగా తడబడ్డాడు. తానెదుర్కొన్న తొలి 32 బంతుల్లో కేవ లం 8 పరుగులే చేయడంతో పాటు మూడుసార్లు అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. అటు పేసర్ బార్ట్‌లెట్ ఏడో ఓవర్‌లో కెప్టెన్ గిల్ (8), విరాట్ (0)ల వికెట్లు తీయడంతో భారత్ తీవ్ర ఒత్తిడిలో పడింది. ఈ దశలో రోహిత్‌కు శ్రేయాస్ జత కట్టాడు. ఆ తర్వాత రోహిత్ 19వ ఓవర్‌లో రెండు సిక్సర్లు, శ్రేయాస్ ఫోర్‌తో 17 రన్స్ రాబట్టారు. ఇదే క్రమంలో ఇద్దరూ తమ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. అయితే వీరు స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరగా, అటు స్పిన్నర్ జంపా, హాజెల్‌వుడ్ మధ్య ఓవర్లలో రన్స్‌ను కట్టడి చేశారు. అక్షర్ బౌండరీలతో ఆకట్టుకున్నా మరో ఎండ్ నుంచి సహకారం అందలేదు. ఒకే ఓవర్‌లో అక్షర్, నితీశ్ (8)లను జంపా పెవిలియన్‌కు చేర్చడంతో భారీ స్కోరుపై ప్రభావం పడింది. కానీ తొమ్మిదో వికెట్‌కు హర్షిత్–అర్ష్‌దీప్ (13) జోడీ 37 పరుగులు జత చేయడంతో సవాల్ విసిరే స్కోరందుకుంది.


స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) హాజెల్‌వుడ్ (బి) స్టార్క్ 73, గిల్ (సి) మార్ష్ (బి) బార్ట్‌లెట్ 9, విరాట్ (ఎల్బీ) బార్ట్‌లెట్ 0, శ్రేయాస్ (బి) జంపా 61, అక్షర్ (సి) స్టార్క్ (బి) జంపా 44, రాహుల్ (బి) జంపా 11, సుందర్ (సి) హాజెల్‌వుడ్ (బి)బార్ట్‌లెట్ 12, నితీశ్ (స్టంప్) క్యారీ (బి) జంపా 8, హర్షిత్ (నాటౌట్) 24, అర్ష్‌దీప్ (బి) స్టార్క్ 13, సిరాజ్ (నాటౌట్) 0బీ ఎక్స్‌ట్రాలు: 9బీ మొత్తం: 50 ఓవర్లలో 264/9. వికెట్ల పతనం: 1-17, 2-17, 3-135, 4-160, 5-174, 6-213, 7-223, 8-226, 9-263బీ బౌలింగ్: స్టార్క్ 10-0-62-2, హాజెల్‌వుడ్ 10-2-29-0, బార్ట్‌లెట్ 10-1-39-3, ఓవెన్ 2-0-20-0, జంపా 10-0-60-4, కూపర్ 3-0-11-0, షార్ట్ 3-0-23-0, హెడ్ 2-0-16-0.




ఆస్ట్రేలియా: మార్ష్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 11, హెడ్ (సి) విరాట్ (బి) హర్షిత్ 28, షార్ట్ (సి) సిరాజ్ (బి) హర్షిత్ 74, రెన్షా (బి) అక్షర్ 30, క్యారీ (బి) సుందర్ 9, కూపర్ (నాటౌట్) 61, ఓవెన్ (సి) అర్ష్‌దీప్ (బి) సుందర్ 36, బార్ట్‌లెట్ (సి) గిల్ (బి) అర్ష్‌దీప్ 3, స్టార్క్ (సి) అక్షర్ (బి) సిరాజ్ 4, జంపా (నాటౌట్) 0, ఎక్స్‌ట్రాలు: 9బీ మొత్తం: 46.2 ఓవర్లలో 265/8. వికెట్ల పతనం: 1-30, 2-54, 3-109, 4-132, 5-187, 6-246, 7-255, 8-260బీ బౌలింగ్: సిరాజ్ 10-0-49-1, అర్ష్‌దీప్ 8.2-0-41-2, హర్షిత్ 8-0-59-2, సుందర్ 7-0-37-2, నితీశ్ 3-0-24-0, అక్షర్ 10-0-52-1.

## దక్షిణాఫ్రికా ఘనవిజయం



రావల్పిండి: పాకిస్థాన్–దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరిగిన రెండు టెస్టుల సిరీస్ 1–1తో సమమైంది. గురువారం ముగిసిన ఆఖరి, రెండో టెస్టులో స్పిన్నర్ సిమోన్ హార్మర్ ఆరు వికెట్లతో పాక్‌ను దెబ్బతీశాడు. దీంతో సౌతాఫ్రికా 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. నాలుగో రోజు హార్మర్ ధాటికి పాక్ రెండో ఇన్నింగ్స్‌లో 138 రన్స్‌కే పరిమితమైంది. బాబర్ ఆజమ్ (50), సల్మాన్ (28) రాణించారు. అనంతరం 68 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సఫారీలు 12.3 ఓవర్లలో 73/2 స్కోరుతో గెలిచారు. మార్‌క్రమ్ (42) వేగంగా ఆడాడు.

## ఉన్నతి కూడా ఇంటికి



సెసాన్–సెవిగ్నె (ఫ్రాన్స్): ఉన్నతి హుడా ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ ప్రీక్వార్టర్స్‌లోనే వెనుదిరిగింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో ఉన్నతి 14–21, 11–21తో వాంగ్ జియి (చైనా) చేతిలో పరాజయం పాలైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ రోహన్/రుత్విక 23–21, 8–21, 17–21తో స్థానిక జంట థామ్ గిజ్వెల్/డెల్ఫిన్ డెల్రూ చేతిలో ఓటమి పాలైంది.

## ప్రపంచ రెజ్లింగ్‌లో ప్రియకు కాంస్యం



నోవి సాద్ (సెర్బియా): అండర్–23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిపలో భారత రెజ్లర్ ప్రియ పతకంతో సత్తా చాటింది. మహిళల 76 కిలోల విభాగంలో ప్రియ కాంస్యం సాధించింది. పతకపోరులో ప్రియ 8–1తో జిమెనెజ్ విలాల్బ (మెక్సిక)పై నెగ్గింది. మిగతా రెజ్లర్లలో నిషు (55 కి.), పుల్కిత్ (65 కి.), శ్రిష్టి (68 కి.) కాంస్య పోరుకు అర్హత సాధించారు.

## సెమీసకు భారత్

ముంబై: హ్యాట్రిక్ ఓటములతో డీలాపడిన భారత్.. మళ్లీ గెలుపు బాట పట్టింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్మృతి మంధాన (95 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 109), ప్రతీక రావల్ (134 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లతో 122) శతకాల మోతతో భారత్.. ప్రపంచ కప్‌లో సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకొంది. గురువారం జరిగిన వర్ష ప్రభావిత మ్యాచ్‌లో భారత్ 53 పరుగుల (డ/లూ పద్ధతి)తో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. మిగిలిన నాలుగో బెర్త్ హర్మన్‌సేన సొంతమవడంతో.. కివీస్ టోర్నీ నుంచి అవుటైంది. తొలుత భారత్ 49 ఓవర్లలో 3 వికెట్లకు 340 పరుగులు చేసింది. మెగా టోర్నీలో మనకిదే అత్యధిక స్కోరు. జెమీమా రోడ్రిగ్స్ (55 బంతుల్లో 11 ఫోర్లతో 76 నాటౌట్) దూకుడుగా ఆడింది. వర్షం అంతరాయం కలిగించడంతో మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించారు. భారత ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత మరోసారి వరుణుడు పలకరించడంతో డక్‌వర్త్–లూయిస్ పద్ధతిలో కివీస్ లక్ష్యాన్ని 44 ఓవర్లలో 325 రన్స్‌గా సవరించారు. ఛేదనలో న్యూజిలాండ్ ఓవర్లన్నీ ఆడి 271/8 స్కోరు మాత్రమే చేసింది. హాలిడే (81), గేజ్ (65 నాటౌట్) అర్ధ శతకాలు వృథా అయ్యాయి. రేణుక, క్రాంతి చెరో 2 వికెట్లు పడగొట్టారు.నెమ్మదిగా మొదలెట్టి..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్లు ప్రతీక, మంధాన.. తొలి వికెట్‌కు 212 పరుగుల భాగస్వామ్యంతో పటిష్ట పునాది వేశారు. 10 ఓవర్లలో భారత్ 40/0తో నిలిచింది. మంధాన.. జెస్ కెర్ బౌలింగ్‌లో సింగిల్‌తో టోర్నీలో తొలి శతకాన్ని నమోదు చేసింది. కానీ, స్మృతిని అవుట్ చేసి బేట్స్ జట్టుకు తొలి బ్రేక్ అందించింది. ఆ తర్వాత సింగిల్‌తో ప్రతీక శతకం సాధించగా.. జెమీమా బౌండ్రీలతో బౌలర్ల భరతం పట్టింది. కాగా, 43వ ఓవర్‌లో ప్రతీక క్యాచవుటైంది. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (10) సహకారంతో ఫిఫ్టీ కొట్టిన రోడ్రిగ్స్.. జట్టు స్కోరును 300 దాటించింది.




భారత్: ప్రతీక (సి/సబ్) రోవ్ (బి) కెర్ 122, మంధాన (సి/సబ్) రోవ్ (బి) బేట్స్ 109, జెమీమా (నాటౌట్) 76, హర్మన్‌ప్రీత్ (సి) కార్సన్ (బి) రోజ్‌మేరీ 10, రిచా ఘోష్ (నాటౌట్) 4, ఎక్స్‌ట్రాలు: 19బీ మొత్తం: 49 ఓవర్లలో 340/3బీ వికెట్ల పతనం: 1-212, 2-288, 3-336బీ బౌలింగ్: రోజ్‌మేరీ మెయిర్ 8-1-52-1, జెస్ కెర్ 8-1-51-0, డివైన్ 6-0-34-0, కార్సన్ 6-0-46-0, తహుహు 4-0-37-0, అమేలియా కెర్ 10-0-69-1, సుజీ బేట్స్ 7-0-40-1.న్యూజిలాండ్: సుజీ బేట్స్ (సి) ప్రతీక (బి) క్రాంతి 1, ప్లిమ్మర్ (బి) రేణుక 30, అమేలియా కెర్ (సి) మంధాన (బి) రాణా 45, డివైన్ (బి) రేణుక 6, హాలిడే (సి) రాణా (బి) శ్రీచరణి 81, గ్రీన్ (సి) క్రాంతి (బి) ప్రతీక 18, ఇసబెల్లా (నాటౌట్) 65, జెస్ కెర్ (సి) మంధాన (బి) క్రాంతి 18, రోజ్‌మేరీ (సి) మంధాన (బి) దీప్తి 1, ఎక్స్‌ట్రాలు: 6బీ మొత్తం: 44 ఓవర్లలో 271/8బీ వికెట్ల పతనం: 1-1, 2-51, 3-59, 4-115, 5-154, 6-226, 7-266, 8-271బీ బౌలింగ్: రేణుక 6-0-25-2, క్రాంతి గౌడ్ 9-0-48-2, స్నేహ్ రాణా 8-0-60-1, శ్రీచరణి 9-0-58-1, దీప్తి 8-0-57-1, ప్రతీక 4-0-19-1

## సోషల్ మీడియాను పట్టించుకోవద్దు: కోహ్లీకి ఇర్ఫాన్ సూచన




ముంబై, అక్టోబర్ 24: వరుసగా రెండు మ్యాచుల్లోనూ డకౌట్ కావడంతో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై సోషల్ మీడియాలో చర్చలు మొదలయ్యాయి. ఇక విరాట్ రిటైర్మెంట్‌కు వేళైందా? అనే సందేహాలూ అభిమానుల్లో వస్తున్నాయి. ఈ నేపథ్యంలో విరాట్ ఆటపై మాజీ ఆటగాడు ఇర్ఫాన్ పఠాన్ స్పందించాడు.'విరాట్ కోహ్లీ వరుసగా రెండుసార్లు డకౌట్ కావడం చాలా అరుదు. దానికి ఒత్తిడి, ఆటకు దూరంగా ఉండటం కారణమై ఉండొచ్చు. ఇలాంటి సమయంలో అభిమానులు, సెలక్టర్లు మద్దతుగా నిలబడాలి. పరుగులు చేయడం ప్రారంభిస్తే.. విరాట్‌ను ఎవ్వరూ ఆపలేరు. ఎందుకంటే కోహ్లీకి వన్డేలంటే చాలా ఇష్టం. అతడు ఆటోమేటిక్‌గా ఆ లయను అందుకుంటాడు. యశస్వి జైస్వాల్ లాంటి యువ ఆటగాళ్లు మరోవైపు సిద్ధంగా ఉన్నప్పుడు సీనియర్లపై ఒత్తిడి ఉంటుంది. దాన్ని తట్టుకుని ఆడటం అంత సులువేం కాదు.

ఈ సందర్భంగా అభిమానులకు ఓ విజ్ఞప్తి. దయచేసి ఎవరూ విరాట్, రోహిత్ వరల్డ్ కప్‌లో ఆడతారా? రిటైర్ అవుతారా? అనే చర్చను కొనసాగించొద్దు. ఇప్పుడు వాళ్లిద్దరూ ఆటను ఆస్వాదించేలా ఉండాలి. తప్పకుండా కోహ్లీ ఫామ్‌ను అందుకుంటాడు. అందుకోసం సహనంగా ఉండాలి. సోషల్ మీడియాలో వచ్చే చర్చలను పట్టించుకోకుండా ఆడాలి' అని ఇర్ఫాన్ వెల్లడించాడు.ఇదే అంశంపై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కూడా స్పందించారు. 'రెండు డకౌట్‌లకే రిటైర్మెంట్ మాట తీసుకురావడం అనవసరం. విరాట్ క్లాస్ ఏంటో అందరికీ తెలుసు. వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్ కూడా అతడే. కేవలం వారికి కావాల్సింది సమయం. ఒక మంచి ఇన్నింగ్స్ చాలు..

# బిజినెస్



## బ్యాంకు ఖాతాదారులకు కేంద్రం మరో గుడ్ న్యూస్




న్యూఢిల్లీ, అక్టోబర్ 24: బ్యాంకు ఖాతాలు, లాకర్లు ఉన్న వారికి ఇప్పటివరకూ ఒకరినే నామినీగా పేర్కొనే అవకాశం ఉండేది. అయితే ఈ అంశంపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై నలుగురిని నామినీగా ఉంచే వీలు కల్పించింది. కేంద్రం తీసుకు వచ్చిన ఈ కొత్త నిబంధనలు ఈ ఏడాది నవంబర్ 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది. భారత్‌లోని మొత్తం బ్యాంకుల్లో దాదాపు రూ. 67 వేల కోట్లకు పైగా నగదు ఎవరూ వెనక్కి తీసుకోకుండా అలాగే ఉండిపోయింది.అందుకు వివిధ కారణాలు ఉన్నట్లు కేంద్రం గుర్తించింది. అంటే అకౌంట్ ఉన్న వ్యక్తి మరణించిన తర్వాత.. ఉన్న ఒక్క నామినీ అందుబాటులో లేకపోవడం వల్ల ఇలా జరుగుతుందని భావిస్తుంది. దీంతో కుటుంబసభ్యులు.. నగదు వెనక్కి తీసుకోవడంలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించింది. వీటిని పరిష్కరించేందుకు కేంద్రం ఈ కొత్త నిబంధనలు తీసుకు వచ్చింది. ఈ నిబంధనలు బ్యాంక్ సేవింగ్ ఖాతా, ఎఫ్‌డీ, ఆర్డీ ఖాతాలతోపాటు లాకర్లకు సైతం వర్తిస్తాయి.ఇక నవంబర్ 1వ తేదీ నుంచి మీ ఖాతాకు ఒకేసారి నలుగురి నామినీలగా పేర్కొనవచ్చు. అంతేకాదు.. ఎవరికి ఎంత వాటా వెళ్లాలనేది మీరే నిర్ణయించుకోవచ్చు. ఒకరి తర్వాత మరొకరు.. నలుగురు నామినీలను వరుస క్రమంలోనూ ఏర్పాటు చేయవచ్చు. అంటే మొదటి నామినీ అందుబాటులో లేకుంటే.. రెండో నామినీకి ఆ అర్హత వస్తుంది. ఇలా నలుగురిలో ఎవరుంటే వారికి అర్హత లభిస్తుంది. నామినీ పేర్లు నమోదు చేసేటప్పుడు.. వారి ఫోన్ నెంబర్లతోపాటు ఈ-మెయిల్ ఐడీ తదితర వివరాలను అందజేయాల్సి ఉంటుంది. అందువల్ల బ్యాంకు వారిని సులభంగా సంప్రదించవచ్చు.

## ఇక బ్యాంకు ఖాతాలకు నలుగురు నామినీలు




న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాదారులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక ఒక్కో బ్యాంకు ఖాతాపై డిపాజిటర్లు నలుగురి వరకు తన నామినీలుగా నామినేట్ చేయవచ్చు. సవరించిన ఈ నిబంధనలు నవంబరు 1 నుంచే అమల్లోకి వస్తాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ మేరకు ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. డిపాజిటర్లు ఈ నామినీల పేర్లను ఒకేసారి లేదా దఫదఫాలుగా పేర్కొనవచ్చు. అలాగే తన తదనంతరం బ్యాంకులోని తన డిపాజిట్‌లో ఏ నామినీకి ఎంత? లేదా ఎంత శాతం ఇవ్వాలో కూడా పేర్కొనవచ్చు. బ్యాంకు లాకర్లకూ ఇవే నిబంధనలు వర్తిస్తాయని ప్రభుత్వం పేర్కొంది. ఈ కొత్త నిబంధనలతో డిపాజిటర్ల తదనంతరం సెటిల్‌మెంట్ ప్రక్రియ మరింత సులభం అవుతుందని భావిస్తున్నారు.

చెక్కుల క్లియరెన్స్‌లో ఇంకా బాలారిష్టాలు: ఎన్‌పీసీఐ

ఈ నెల 4వ తేదీ నుంచి ప్రవేశపెట్టిన సత్వర చెక్కుల క్లియరెన్స్‌లో ఇంకా కొన్ని బాలారిష్టాలు కొనసాగుతున్నట్టు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తెలిపింది. వీటిని కూడా అధిగమించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్టు పేర్కొంది. గతంలో చెక్కుల క్లియరెన్స్‌కు రెండు మూడు రోజుల సమయం పట్టేది. చెక్ ప్రజెంట్ చేసిన కొన్ని గంటల్లో అదే రోజు క్లియర్ చేసేలా చెక్ ట్రంకేటెడ్ సిస్టమ్ (సీటీసీ) పేరుతో ఆర్‌బీఐ ఈ నెల 4వ తేదీ నుంచి కొత్త విధానం ప్రవేశ పెట్టింది. అయితే సాంకేతిక సమస్యలు, బ్యాంకు సిబ్బందికి సరైన శిక్షణ లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో చెక్కుల క్లియరెన్స్‌కు ఐదారు రోజులు పడుతోంది. దీనిపై ప్రజల నుంచి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఎన్‌పీసీఐ ఈ ప్రకటన విడుదల చేయడం విశేషం.

దేశంలో డిజిటల్ చెల్లింపులు శరవేగంతో విస్తరిస్తున్నాయి. 2019లో రూ.1,775 లక్షల కోట్ల విలువైన 3,248 కోట్ల లావాదేవీలు నమోదవగా, గత ఏడాది (2024) మొత్తం మీద రూ.2,830 లక్షల కోట్ల విలువైన 20,849 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. శాతంపరంగా చూస్తే గత ఏడాది నమోదైన మొత్తం చెల్లింపుల లావాదేవీల్లో 99.7 శాతం డిజిటల్ చెల్లింపులని ఆర్‌బీఐ తెలిపింది. విలువపరంగా చూసినా ఈ చెల్లింపుల వాటా మొత్తం చెల్లింపుల్లో 97.5 శాతం వరకు ఉంది. కాగా ఈ ఏడాది (2025) తొలి ఆరు నెలల్లోనూ ఇదే పరిస్థితి. నెఫ్ట్, ఐఎంపీఎస్, ఆర్‌టీజీఎస్, ఎన్‌ఏసీహెచ్, డెబిట్, క్రెడిట్ కార్డ్స్, ప్రీపెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్, యూపీఐ వంటి చెల్లింపులన్నీ డిజిటల్ చెల్లింపుల పరిధిలోకి వస్తాయి. వ్యాపార, వ్యక్తిగత చెల్లింపుల్లో డిజిటల్ లావాదేవీలు శరవేగంతో పెరుగుతుంటే, పేపర్ ఆధారిత చెక్కుల చెల్లింపుల వాటా ఇదే సమయంలో మొత్తం చెల్లింపుల్లో 2.3 శాతానికి పడిపోయింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనూ దేశంలో రూ.1,572 లక్షల కోట్ల విలువైన 12,549 కోట్ల డిజిటల్ చెల్లింపుల లావాదేవీలు నమోదయ్యాయి.

## పసిడి ప్రియులకు మళ్లీ గుడ్ న్యూస్..




ఇటీవల వరకు బంగారం ధర భారీగా పెరిగింది. అయితే అంతర్జాతీయంగా బంగారం ధర తగ్గింది. దీంతో పసిడి ధరలు కొంత మేర తగ్గాయి. ఆ క్రమంలో ఈ రోజు అంటే.. శుక్రవారం బంగారం ధర స్వల్పంగా దిగి వచ్చాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,25,070గా ఉంది. ఇదే 10 క్యారెట్ల బంగారం ధర నిన్న అంటే గురువారం రూ 1,25,080గా ఉంది. అంటే రూ.10 మేర ధర తగ్గింది. ఇక 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,14,640గా ఉంది. ఈ బంగారం ధర నిన్న అంటే గురువారం రూ. 1,14, 650గా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములు రూ.1,26,020గా ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములు రూ.1,14, 790గా ఉంది. అలాగే తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ఎలా ఉన్నాయంటే.. హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,25,070గా ఉంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,14,640గా ఉంది. ఇవే ధరలు విజయవాడ, విశాఖపట్నంలో ఉన్నాయి.

## అదానీ గ్రూప్ నుంచి రూ 1050 కోట్ల ఆర్డర్




హైదరాబాద్ కేంద్రంగా ఉన్న బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్‌కి అదానీ గ్రూప్ నుంచి రూ.1,050 కోట్ల విలువైన భారీ ఆర్డర్ లభించింది. ఆర్డర్‌లో భాగంగా గుజరాత్‌లోని ఖావ్డా వద్ద అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ గ్రీన్ ఎనర్జీ సిక్స్ కంపెనీలు ఏర్పాటు చేసే 650 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టుకు అవసరమైన యంత్ర పరికరాలను బొండాడ ఇంజనీరింగ్.. ఈపీసీ పద్ధతిలో సరఫరా చేస్తుంది. ఆర్డర్ అందుకున్న ఏడాదిలోగా ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది.

## ఎలీ లిల్లీతో సిప్లా జట్టు




న్యూఢిల్లీ: టైప్-2 మధుమేహం, ఊబకాయం చికిత్సలో ఉపయోగించే ఔషధం టిర్జెపటైడ్‌ను 'యుర్పీక్' బ్రాండ్‌నేమ్‌తో భారత్‌లో విక్రయించేందుకు అంతర్జాతీయ ఫార్మా దిగ్గజం ఎలీ లిల్లీతో దేశీయ ఔషధ సంస్థ సిప్లా ఒప్పం దం కుదుర్చుకుంది. ఎలీ లిల్లీ టిర్జెపటైడ్ ఔషధాన్ని మౌంజారో పేరుతో ఈ ఏడాది మార్చిలోనే భారత్‌లో ప్రవేశపెట్టింది. అయితే, దేశంలో ఈ ఔషధ లభ్యతను నగరాల పరిధి దాటి విస్తరించేందుకు మరో బ్రాండ్‌నేమ్ (యుర్పీక్)తోనూ విక్రయించేందుకు ఎలి లిల్లీ, సిప్లా జట్టు కట్టాయి. ఈ అగ్రిమెంట్‌లో భాగంగా ఎలీ లిల్లీ యుర్పీక్‌ను తయారు చేసి సిప్లాకు సరఫరా చేస్తుంది.

## కొన్ని ఉత్పత్తుల ధరలు పెరిగే చాన్స్ హెచ్‌యూఎల్




న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్లు తగ్గినా కొన్ని వస్తువుల రేట్లు స్వల్పంగా పెరిగే అవకాశం ఉందని ఎఫ్‌ఎంసీజీ దిగ్గజం హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) భావిస్తోంది. ముఖ్యంగా జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రభావం లేని ఉత్పత్తుల ధరలు పెరుగుతాయని కంపెనీ సీఎఫ్ఓ రితేష్ తివారీ చెప్పారు. అయితే ఈ పెంపు స్వల్పస్థాయిలోనే ఉంటుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో తమ అమ్మకాల వృద్ధి రేటులో పెద్దగా ఎదుగూ బొదుగూ లేదన్నారు. అయితే నవంబరు నుంచి అమ్మకాల వృద్ధి రేటు ఊపందుకునే అవకాశం ఉందన్నారు. కాగా సెప్టెంబరుతో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో హెచ్‌యూఎల్ నికర లాభం 3.8 శాతం పెరిగి రూ.2,694 కోట్లుగా నమోదైంది. సమీక్షా కాలంలో మొత్తం రెవెన్యూ కూడా రూ.15,703 కోట్ల నుంచి రూ.16,034 కోట్లకు పెరిగింది. కాగా రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.19 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు ప్రకటించింది.

## అదరగొట్టిన లారస్ ల్యాబ్స్




లారస్ ల్యాబ్స్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అద్భుతమైన ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికాని (క్యూ2)కి గాను కంపెనీ రూ.1,653 కోట్ల రెవెన్యూపై రూ.195 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.20 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా 875 శాతం వృద్ధి చెందగా ఆదాయం 35 శాతం వృద్ధి చెందిం ది. కాంట్రాక్ట్ డెవల్‌పమెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీడీఎంఓ) విభాగం అద్భుతమైన పనితీరు కనబరచటం సహా జెనరిక్స్‌లో మెరుగైన వృద్ధి కనబరచటం కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా వెల్లడించారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006